


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 62 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : శ్రీకాకుళం సోమవారం 16 మార్చి 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 62 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : SRIKAKULAM MON 16 MARCH 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

## ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా బ్రతికే ఉన్నాడు..

# కానీ కదలలేని స్థితిలో!

## భారత ఇంటెలిజెన్స్ సంచలన నివేదిక!



- ఫిబ్రవరి 28న ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా భీకర దాడులు
- సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేని మృతి
- మొజ్తబాకు తీవ్ర గాయాలు అంటూ భారత ఇంటెలిజెన్స్ రిపోర్ట్!
- మొజ్తబా తరపున ఐఆర్జీసీనే పాలన సాగిస్తోందని వెల్లడి
- ఇటీవల ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు మరింత బలం చేకూర్చేలా ఇంటెలిజెన్స్ నివేదిక!

**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ బ్రతికే ఉన్నప్పటికీ, తీవ్ర గాయాలతో కదలలేని (ఇమ్మొబైల్) స్థితిలో ఉన్నారని భారత ఇంటెలిజెన్స్ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో ఓ కథనం వెలువడింది. ఆయన సంభాషణలు, బహిరంగ ప్రకటనలన్నీ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) కట్టుదిట్టమైన నియంత్రణలో ఉన్నాయని ఆ కథనం స్పష్టం చేసింది. ఈ పరిణామం ఇరాన్ నాయకత్వంపై, దేశ స్థిరత్వంపై అంతర్జాతీయంగా తీవ్ర

- మిగతా2లో



## విజయ్‌కి డిప్యూటీ సీఎం పోస్టు ఆఫర్..?


**పెన్ పవర్ డెస్క్:**తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలన నేపథ్యంలో రాష్ట్రంలో భాజపా, టీవీకే పార్టీల మధ్య పొత్తు విషయంలో మరోసారి వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. పొత్తులో భాగంగా టీవీకే అధినేత విజయ్ కు డిప్యూటీ సీఎం పదవి ఇస్తామని భాజపా ఆఫర్ చేసిందని ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి. టీవీకేతో పొత్తుకు సంబంధించి చర్చలు తుది దశకు చేరుకున్నాయని భాజపా వర్గాలు తెలిపాయి. ఆ పార్టీకి 80 సీట్లు ఇచ్చేందుకు ముందుకొచ్చినట్లు పేర్కొన్నాయి. విజయ్‌కు డిప్యూటీ సీఎం పదవిని కూడా ఆఫర్ చేసినట్లు వెల్లడించాయి. ముఖ్యమంత్రి పదవిపై విజయ్ దృష్టి పెట్టారని.. చర్చల్లో ఈ విషయం కీలకంగా మారిందని చెప్పాయి. అయితే, ఈ విషయంపై ఇప్పటివరకు ఇరుపార్టీల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. భాజపా, డీఎంకేలతో తమకు పొత్తులు ఉండవని విజయ్ గతంలోనే తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. అయినా.. వీటికి సంబంధించిన వార్తలు వస్తూనే ఉండటం గమనార్హం.

## ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌పై

# చంద్రబాబు సీరియస్...

### నోటీసులు ఇవ్వాలని పల్లాకు ఆదేశం!

- మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసులో ఎంపీ పుట్టా అరెస్ట్
- ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌పై సీఎం చంద్రబాబు ఆగ్రహం
- పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆదేశం
- వివరణ కోరుతూ నోటీసులు ఇవ్వాలని పల్లాకు సూచన
- ఇలాంటివి ఉపేక్షించేది లేదని చంద్రబాబు స్పష్టం



**పెన్ పవర్ డెస్క్:**మొయినాబాద్ ఫామ్ హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ వ్యవహారంలో ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ పట్టుబడటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్న ఆయన, పార్టీ కార్యకలాపాలకు తక్షణమే దూరంగా ఉండాలని పుట్టా మహేశ్‌ను ఆదేశించారు. ఈ విషయంపై స్పందించిన చంద్రబాబు.. పుట్టా మహేశ్ నుంచి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే, డ్రగ్స్ కేసులో పుట్టా పట్టుబడిన వ్యవహారంపై పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని కూడా పల్లాను ఆదేశించారు. వ్యక్తుల బలహీనతలు, వ్యక్తిగత తప్పిదాల వల్ల పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని చంద్రబాబు తేల్చిచెప్పారు. డ్రగ్స్ వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఎవరైనా సరే, ఉపేక్షించే ప్రసక్తే లేదని పార్టీ జాతీయ అధ్యక్షుడి హోదాలో ఆయన ఉద్ఘాటించారు. ఈ ఘటనపై పార్టీపరంగా కఠిన చర్యలు ఉంటాయనే సంకేతాలను ఇచ్చారు.

## కావూరి సాంబశివరావు కుటుంబ సభ్యుల్ని పరామర్శించిన సీఎం చంద్రబాబు



- ఇటీవల కన్నుమూసిన కావూరి సాంబశివరావు
- హైదరాబాద్‌లోని కావూరి నివాసానికి వెళ్లి నివాళులు అర్పించిన చంద్రబాబు
- ప్రజాప్రతినిధిగా కావూరి సేవలను కొనియాడిన ముఖ్యమంత్రి
- మాజీ డీజీపీ హెచ్‌జే దొర కుటుంబసభ్యులను కూడా పరామర్శించిన చంద్రబాబు
- పోలీసు శాఖకు దొర చేసిన కృషిని గుర్తు చేసుకున్న వైనం

- మిగతా2లో




## నెతన్యాహుకు ఇరాన్ 'డెత్ వార్నింగ్'!

- వెంటాడి, వేటాడి చంపుతామని ఐఆర్ జీసీ హెచ్చరిక
- బాగ్దాద్ అమెరికా ఎంబసీపై క్షిపణి దాడి
- ఖర్గ్ ఐలాండ్‌ను ధ్వంసం చేసిన అమెరికా

**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా కూటమి మధ్య జరుగు తున్న యుద్ధం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరు కుంది. తమ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారంగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహును 'వేటాడి చంపుతామని' ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్ జీసీ) శనివారం ప్రతిజ్ఞ చేశాయి. నెతన్యాహు ఆచూకీపై సామాజిక మాధ్యమాల్లో పుకార్లు వస్తున్న తరుణంలో ఆయన ఎక్కడ ఉన్నా వదిలిపెట్టబోమని ఇరాన్ సైన్యం హెచ్చరించింది.

- మిగతా2లో

## ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కు స్టేషన్ బెయిల్ మంజూరు

- మొయినాబాద్ ఫామ్‌హౌస్ లో డ్రగ్స్ పార్టీ
- పట్టుబడిన వారిలో ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్
- మొత్తం ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్
- మొత్తం 11 మందిపై కేసు నమోదు
- కేసు దర్యాప్తు వేగవంతం చేసిన ఈగల్ టీమ్



- మిగతా2లో




## నాలుగు రాష్ట్రాలు మోగిన ఎన్నికల నగారా..

- నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి ఎన్నికల షెడ్యూల్ విడుదల
- పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు
- పశ్చిమ బెంగాల్‌లో రెండు దశల్లో, మిగిలిన చోట్ల ఒకే విడతలో పోలింగ్
- ఏప్రిల్ నెలలో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తి
- అన్ని ప్రాంతాల ఓట్ల లెక్కింపు మే 4వ తేదీన..

- మిగతా2లో

## వివేకా హత్య కేసు: సీబీఐ దర్యాప్తుపై

# సునీత తీవ్ర అసంతృప్తి



- కీలక నిందితుల ఫోన్ సంభాషణలను సీబీఐ పట్టించుకోలేదని ఆరోపణ
- జగన్, భారతిని కూడా విచారించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య
- న్యాయం జరిగే వరకు తన పోరాటం ఆగదని స్పష్టం చేసిన సునీత

**పెన్ పవర్ డెస్క్:**మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణ తీరుపై ఆయన కుమార్తె డాక్టర్ సునీత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సీబీఐ బాధ్యతాయుతంగా, లోతుగా దర్యాప్తు చేయలేదని ఆమె

- మిగతా2లో

## డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన పుట్టా మహేశ్‌కు ఎంపీగా ఉండే అర్హత లేదు



- మొయినాబాద్ డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన ఏలూరు టీడీపీ ఎంపీ
- పుట్టా మహేశ్ డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారించిన పోలీసులు
- పుట్టాను కాపాడేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని వైసీపీ నేత కాకాణి ఆరోపణ
- చంద్రబాబు బ్రాండ్ అంటే డ్రగ్స్ బ్రాండ్ అని విమర్శ
- సామాన్యుడికి ఒక రూల్, ప్రజాప్రతినిధికి మరో రూల్ ఉండకూడదని వ్యాఖ్యలు

- మిగతా2లో



## బైక్ పొగకు ఊపిరాడక తాత, ముగ్గురు చిన్నారుల మృతి

### పుంగనూరులో విషాదం..

- బైక్ నుంచి వెలువడిన పొగ పీల్చి తాత, ముగ్గురు చిన్నారుల దుర్మరణం
- మెకానిక్ సలహాతో బైక్‌ను రాత్రంతా ఆన్‌లో ఉంచిన యజమాని
- పైగదిలో నిద్రించడంతో ప్రాణాలతో బయటపడ్డ దంపతులు

- మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

# సరదా కోసం యుద్ధం చేస్తావా?

### ఓరీ నీ ట్రంప్.. మామూలోడివి కాదు సామీ

అమెరికా రాజకీయాల్లో డొనాల్డ్ ట్రంప్ అనే పేరు ఒక 'టెలివిజన్ రియాలిటీ షో' లాంటిది. అక్కడ ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. తాజాగా ఇరాన్ విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ఆయనకు అంతర్జాతీయ రాజకీయాలు అంటే ఒక 'వీడియో గేమ్' అనిపిస్తోంది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లోని ఖర్గ్ ద్వీపంపై ఇప్పటికే భారీగా దాడులు చేసి అక్కడి చాలా భాగాన్ని నాశనం చేశామని ఆయన పేర్కొన్నారు. అవసరమైతే కేవలం వినోదం కోసం కూడా మళ్లీ దాడులు చేసే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. ఇరాన్ తమతో ఒప్పందానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ వారు పెట్టిన షరతులు సరైనవిగా లేవని ట్రంప్ విమర్శించారు. ఇదే సమయంలో ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఇంకా బతికే ఉన్నారా అని కూడా ఆయన ప్రశ్నించడం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

**ఆ 'వినోదం' ఏంటో!**

సాధారణంగా ఎవరైనా యుద్ధం గురించి మాట్లాడాలంటేనే వెన్నులో వణుకు పుడుతుంది. కానీ ట్రంప్ గారు మాత్రం యుద్ధాన్ని ఏకంగా "ఎంటర్టైన్మెంట్" కిందకు చేర్చేశారు. "వినోదం కోసం కూడా దాడులు చేస్తాం" అని ఆయన అన్నారంటే ఆయనకు ప్రపంచ పటం ఒక 'బోర్డ్ గేమ్' అని అర్థం చేసుకోవాలి. పాపం.. యుద్ధం అంటే ఏంటో తెలిసిన వాళ్లు ఈ మాట విని షాక్ అవుతుంటే ట్రంప్ మాత్రం రిమోట్ కంట్రోల్ పట్టుకుని దాడులను టీవీలో చూస్తున్నట్టు బిల్డప్ ఇస్తున్నారు.

**సుప్రీం లీడర్ బతికే ఉన్నారా?**

ఇక ఆయన ప్రశ్నల సెన్స్ ఏంటో ఎవరికీ అర్థం కాదు. "ఇరాన్ సుప్రీం లీడర్ ఇంకా బతికే ఉన్నారా?" అని అడగడం వెనుక ఏ వ్యూహం ఉందో ఆయనకే తెలియాలి. ఇది ఒక రకమైన 'మైండ్ గేమ్' అనుకోవాలా లేక తనదైన శైలిలో కవ్వించడమా? ఆయనకు ఏది సరదా? ఏది రాజకీయం? అన్నది తెలుసుకోవడం సాధారణ రాజకీయ విశ్లేషకులకు అసాధ్యం.

**యుద్ధమా? వ్యాపారమా?**

ట్రంప్ గారి దృష్టిలో అంతర్జాతీయ సంబంధాలు అంటే ఒక డీల్. ఇరాన్ ఒప్పందం గురించి మాట్లాడుతూ "మాకు నచ్చినట్లు ఉంటేనే ఓకే.. లేదంటే దాడులే" అనడం చూస్తుంటే, ఆయనకు 'ప్రపంచ శాంతి' కంటే 'పవర్' ఆడే ఆటలో గెలవడమే ముఖ్యమనిపిస్తోంది. ట్రంప్ పాత కాలం నాటి రాజకీయ నాయకులకు, ఇప్పటి టెక్నాలజీ యుగంలో సోషల్ మీడియా ఫాలోయింగ్‌ను కలిపేసిన ఒక కొత్త 'పొలిటికల్ బ్రాండ్'. ఆయన మాటలు వింటుంటే ఎప్పుడు నవ్వాలో, ఎప్పుడు ఆందోళన చెందాలో అర్థం కాక ప్రపంచం తల పట్టుకుంటోంది. ఏదేమైనా ఆయనకు యుద్ధం అంటే సరదా కావచ్చు కానీ ఆ సరదా వల్ల ప్రపంచం పడే ఇబ్బందులే అసలైన 'ట్రాజెడీ'!

# ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా బ్రతికే ఉన్నాడు.. కానీ కదలలేని స్థితిలో!

- మొదటి పేజి తరువాయి

ఆందోళనలకు దారితీస్తోంది. భారత ప్రభుత్వానికి చెందిన అత్యంత విశ్వసనీయ ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం ప్రకారం... ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో అప్పటి సుప్రీం లీడర్, మొజ్తబా తండ్రి అయిన అయతుల్లా అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఇదే దాడుల్లో మొజ్తబా ఖమేనీ తీవ్రంగా గాయపడ్డారు. ఆ గాయాల కారణంగా ఆయన ప్రస్తుతం కదలలేని స్థితిలో ఉన్నారు. దీంతో దేశంలో అస్థిరత ఏర్పడకుండా ఉండేందుకు ఐఆర్‌జీసీ రంగంలోకి దిగింది. మొజ్తబాతో పరిమిత సంప్రదింపులు జరుపుతూ, ఆయన పేరుతో సందేశాలను, సోషల్ మీడియా పోస్టులను అత్యంత జాగ్రత్తగా రూపొందించి విడుదల చేస్తోంది. దేశంలో అంతా సవ్యంగా ఉందనే భావన కల్పించేందుకే ఐఆర్‌జీసీ ఈ చర్యలు చేపడుతోందని నివేదిక పేర్కొంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఈ నివేదికకు బలాన్నిస్తున్నాయి. ఖమేనీ బ్రతికే ఉన్నారని, కానీ దాడుల్లో తీవ్రంగా గాయపడి రూపురేఖలు మారిపోయి ఉండొచ్చని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనికి తోడు, సుప్రీం లీడర్‌గా తన సొంత ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కూడా మొజ్తబా ఖమేనీ హాజరు కాలేదు. వేదికపై కేవలం ఆయన ఫోటోను మాత్రమే ప్రదర్శించడం ఆయన ఆరోగ్య పరిస్థితిపై నెలకొన్న ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసింది. అయితే, ఈ ఆరోపణలను ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ తీవ్రంగా ఖండించారు. మొజ్తబా ఖమేనీ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని, ఇవన్నీ అమెరికా సృష్టిస్తున్న అసత్య ప్రచారాలని కొట్టిపారేశారు.

కానీ, క్షేత్రస్థాయి పరిస్థితులు, భారత ఇంటెలిజెన్స్ నివేదిక మాత్రం పరిస్థితి తీవ్రంగానే ఉందని సూచిస్తున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, ఇరాన్‌లో నెలకొన్న ఈ నాయకత్వ సంక్షోభం పశ్చిమాసియా రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ప్రస్తుతం తాత్కాలికంగా ఐఆర్‌జీసీయే పాలనా వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది.

# డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన పుట్టా మహేశ్‌కు ఎంపీగా ఉండే అర్హత లేదు

డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్‌కు పదవిలో కొనసాగే నైతిక అర్హత లేదని వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. పుట్టా మహేశ్‌ను రక్షించడానికి స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే రంగంలోకి దిగారని, డ్రగ్స్ మాఫియాను ఆయనే పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. సామాన్యుడికి ఒక రూల్, ప్రజాప్రతినిధికి మరో రూల్ ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ శివారు మొయినాబాద్‌లోని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో జరిగిన వీకెండ్ పార్టీలో డ్రగ్స్ కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ పార్టీలో పుట్టా మహేశ్ డ్రగ్స్ తీసుకున్నట్లు ఈగిల్ ఫోర్స్ పోలీసులు అధికారికంగా ప్రకటించారు. ఈ ఘటన ఏపీ రాజకీయాల్లో పెద్ద దుమారం రేపింది. ఈ నేపథ్యంలో కాకాణి మాట్లాడుతూ, "చంద్రబాబు బ్రాండ్ అంటేనే డ్రగ్స్ బ్రాండ్" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

ఈ ఘటనతో వైసీపీ నేతలు టీడీపీని 'డ్రగ్స్ పార్టీ'గా అభివర్ణిస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రస్తుతం ఈ డ్రగ్స్ కేసుపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఇదే ఫామ్‌హౌస్‌లో కాల్పులు జరిపిన వ్యక్తిని కూడా అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం పుట్టా మహేశ్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# నెతన్యాహుకు ఇరాన్ 'డెత్ వార్నింగ్'!

- మొదటి పేజి తరువాయి

. "అతను బతికే ఉంటే.. అతన్ని వెంబడిస్తాం, పట్టుకుంటాం, చంపేస్తాం" అంటూ టెలిగ్రామ్ ఛానల్ వేదికగా ఐఆర్ జీసీ సంచలన ప్రకటన చేసింది. యుద్ధం 16వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై మరోసారి క్షిపణి దాడి జరిగింది. ఎంబసీ ఆవరణలోని హెలిప్యాడ్‌పై మిస్సైల్ పడటంతో పెద్ద ఎత్తున పొగలు వ్యాపించాయి. మరోవైపు, ఇరాన్‌లోని వ్యూహాత్మక 'ఖర్గ్ ఐలాండ్'పై అమెరికా జరిపిన బాంబు దాడులను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమర్థించుకున్నారు. ఖర్గ్ ఐలాండ్‌లోని సైనిక స్థావరాలను పూర్తిగా ధ్వంసం చేశామని, అవసరమైతే మరిన్ని దాడులు చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రపంచ దేశాలన్నీ హర్మూజ్ జలసంధిలో నౌకల రక్షణకు ముందుకు రావాలని ట్రంప్ పిలుపునిచ్చారు. ఇరాన్ సైన్యం కూడా వెనక్కి తగ్గడం లేదు. ఇప్పటికే ఇజ్రాయెల్‌పై ఐదు సార్లు బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మాట్లాడుతూ.. తమ దేశ చమురు క్షేత్రాలపై దాడి జరిగితే పశ్చిమాసియాలో అమెరికా వాటాలున్న ప్రతి చమురు కేంద్రాన్ని బూడిద చేస్తామని హెచ్చరించారు. ఈ యుద్ధ ప్రభావంతో బహ్రెయిన్, సౌదీ అరేబియాలో జరగాల్సిన ఫార్ములా-1 రేసింగ్‌లు కూడా రద్దయ్యాయి. ఇరు పక్షాల మధ్య దాడులు, ప్రతిదాడులు తీవ్రం కావడంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం ఏర్పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

# బైక్ పొగకు ఊపిరాడక తాత, ముగ్గురు చిన్నారుల మృతి

అన్నమయ్య జిల్లా పుంగనూరులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఓ మెకానిక్ ఇచ్చిన సలహా పాటించడం వల్ల ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. బైక్ ఇంజిన్ నుంచి వెలువడిన పొగను పీల్చి తాత, ముగ్గురు మనవళ్లు మృతి చెందిన ఈ ఘటన పట్టణంలోని త్యాగరాజు వీధిలో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. త్యాగరాజు వీధికి చెందిన మురళి తన ద్విచక్ర వాహనానికి మరమ్మతులు చేయించాడు. ఇంజిన్ సమస్య ఉండటంతో మెకానిక్, రాత్రంతా బైక్‌ను ఆన్‌లో ఉంచాలని సూచించాడు. దీంతో మురళి ఇంట్లోనే బైక్‌ను ఆన్ చేసి ఉంచి, తలుపులు మూసేశాడు. ఆ సమయంలో మురళి తండ్రి రామచంద్రయ్య, కుమారుడు కార్తీక్, కవల కుమార్తెలు చరిత, చందన కింద గదిలో నిద్రిస్తుండగా.. మురళి, అతడి భార్య రేవతి పైగదిలో పడుకున్నారు.

ఇల్లు ఇరుకుగా ఉండి, గాలి సరిగా ఆడే వీలు లేకపోవడంతో బైక్ నుంచి వెలువడిన పొగ గది మొత్తం వ్యాపించింది. ఈ పొగను పీల్చడంతో ఊపిరాడక తాత, మనవడు, మనవరాళ్లు నిద్రలోనే ప్రాణాలు విడిచారు. పైగదిలో ఉండటంతో మురళి, రేవతి దంపతులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కళ్లముందే కన్నబిడ్డలు, తండ్రి విగతజీవులుగా పడి ఉండటంతో వారి రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# వివేకా హత్య కేసు: సీబీఐ దర్యాప్తుపై సునీత తీవ్ర అసంతృప్తి

- మొదటి పేజి తరువాయి

సంచలన ఆరోపణలు చేశారు. కడప జిల్లా పులివెందులలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కేసులో తనకు అందరూ అన్యాయం చేస్తున్నారని సునీత ఆవేదన వ్యక్తం చేశారు. "నిందితులు చెప్పింది వినడమే తప్ప సీబీఐ లోతుగా దర్యాప్తు జరపలేదు. హత్యకు ముందు, తర్వాత నిందితుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలను ఏమాత్రం సీరియస్‌గా తీసుకోలేదు. సాక్షిలో గుండెపోటు వార్త రావడానికి నిమిషం ముందే కిరణ్ యాదవ్ అనే వ్యక్తి అర్జున్‌రెడ్డికి మెసేజ్ పంపాడు. ఈ కీలక ఆధారాన్ని సీబీఐ ఎందుకు లోతుగా పరిశీలించలేదు?" అని ఆమె ప్రశ్నించారు. తాను కోర్టుతో పాటు సీబీఐకి కూడా అదనపు ఆధారాలు సమర్పించినప్పటికీ, వాటిపై కూడా సరైన విచారణ జరగలేదని సునీత ఆరోపించారు. ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి జగన్, ఆయన అర్ధాంగి భారతిని విచారించాల్సిన అవసరం ఉందని, కానీ సీబీఐ వారిని విచారించలేదని అన్నారు. తాను ఇంతగా పోరాడుతున్నా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన సునీత.. న్యాయం జరిగే వరకు తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

# నాలుగు రాష్ట్రాలు మోగిన ఎన్నికల నగారా..

దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాం తానికి అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, అసోంతో పాటు కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఆదివారం విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ అన్ని ప్రాంతాల్లో మే 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. వివరాల్లోకి వెళితే, పశ్చిమ బెంగాల్‌లోని 294 స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 23న తొలి దశ, ఏప్రిల్ 29న రెండో దశ పోలింగ్ నిర్వహిస్తారు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుంది. ఇక అసోం (126), కేరళ (140), పుదుచ్చేరి (30) అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది.

ఎన్నికల షెడ్యూల్‌కు ముందు రాజకీయ పార్టీల నేతలతో, ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులతో సమావేశాలు నిర్వహించి సలహాలు స్వీకరించామని

జ్ఞానేశ్ కుమార్ వివరించారు. ఈ ఐదు ప్రాంతాల్లో మొత్తం 17.4 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, 2.18 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, యువత పెద్ద ఎత్తున ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మే 4న జరిగే కౌంటింగ్‌తో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

# నా సినిమాను దెబ్బతీయడానికే మోనాలిసా పెళ్లి.. దర్శకుడి సంచలన ఆరోపణలు



'ది డైరీ ఆఫ్ మణిపూర్' సినిమాతో తాను హీరోయిన్‌గా పరిచయం చేస్తున్న నటి మోనాలిసా భోంస్లే వయసుపై ఫిల్మ్ మేకర్ సనోజ్ మిశ్రా సంచలన ఆరోపణలు చేశారు. ఆమె మైనర్ అని, ఆమె వయసుపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇటీవల మోనాలిసా వివాహం చేసుకోవడంతో ఈ వివాదం తెరపైకి వచ్చింది. ఈ విషయంపై సనోజ్ మిశ్రా మాట్లాడుతూ.. మహాకుంభ్ సమయంలో మోనాలిసా వయసు సుమారు 16 సంవత్సరాలేనని, పెళ్లి కోసం ఆమె వయసు పత్రాలను తారుమారు చేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. "మోనాలిసా అసలు వయసును నిర్ధారించేందుకు మెడికల్ పరీక్షలు జరపాలని డిమాండ్ చేసేందుకు నేను మహేశ్వర్ వెళ్లి ఆమె కుటుంబాన్ని కలుస్తాను" అని ఆయన తెలిపారు. ఈ పెళ్లి తన సినిమా ప్రాజెక్టును దెబ్బతీయడానికి పక్కా ప్రణాళికతో చేసిన కుట్ర అని సనోజ్ మిశ్రా ఆరోపించారు. మోనాలిసా తన సినిమాలో నటించకుండా ఉండేందుకే కొన్ని బృందాలు ఈ పెళ్లిని జరిపించాయని ఆయన అన్నారు. ఒకవేళ వైద్య పరీక్షల్లో మోనాలిసా మైనర్ అని తేలితే, ఆమె భర్త ఫర్మాన్‌తో పాటు ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న ఇతరులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కొద్ది రోజుల క్రితమే మోనాలిసా, ఫర్మాన్ ఖాన్ అనే వ్యక్తిని కేరళలో వివాహం చేసుకుంది. అయితే, జనవరిలోనే ఆమెకు 18 ఏళ్లు నిండాయని కుటుంబ సభ్యులు, పోలీసులు చెబుతున్న నేపథ్యంలో దర్శకుడి ఆరోపణలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కు స్టేషన్ బెయిల్ మంజూరు

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో పట్టుబడిన టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్‌కు పోలీసులు స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు. సోమవారం (మార్చి 16) పార్లమెంట్ సమావేశాలు ఉన్నందున ఆయనకు నోటీసులు ఇచ్చి వదిలేసినట్టు తెలిసింది. ఎంపీ మహేశ్ యాదవ్‌తో పాటు మరో నిందితురాలైన ప్రియాంక రెడ్డికి కూడా స్టేషన్ బెయిల్ లభించినట్లు సమాచారం. మరోవైపు, ఈ కేసు దర్యాప్తును ఈగల్ టీమ్ వేగవంతం చేసింది. మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు, వారి నుంచి కీలక వివరాలు రాబడుతున్నారు. ఈ పార్టీకి డ్రగ్స్ ఎక్కడి నుంచి సరఫరా అయ్యాయి, దీని వెనుక ఎవరున్నారు అనే కోణంలో విచారణ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, నిందితులకు నిర్వహించిన డ్రగ్స్ పరీక్షల్లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, పుట్టా మహేశ్ సహా ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్ అని తేలినట్లు పోలీసులు తెలిపారు.

# కావూరి సాంబశివరావు కుటుంబ సభ్యుల్ని పరామర్శించిన సీఎం చంద్రబాబు

ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ రాజకీయవేత్త కావూరి సాంబశివరావు కుటుంబ సభ్యులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరామర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని కావూరి నివాసానికి వెళ్లిన సీఎం, ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి శ్రద్ధాంజలి అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా కావూరి సాంబశివరావు దేశానికి, రాష్ట్రానికి అందించిన సేవలను చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ప్రజా జీవితంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.


**హెచ్.జె. దొర కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు పరామర్శ**

అలాగే, ఇటీవల మరణించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్.జె. దొర కుటుంబ సభ్యులను కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. హైదరాబాద్‌లోని దొర నివాసానికి వెళ్లి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉమ్మడి రాష్ట్ర పోలీస్ విభాగానికి దొర చేసిన సేవలను, శాఖను ఉన్నత శిఖరాలకు చేర్చడంలో ఆయన చేసిన కృషిని చంద్రబాబు ఈ సందర్భంగా స్మరించుకున్నారు.




పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## మందుగుండు సామాగ్రి పేలి గోపాలపట్నం పరిధిలో భారీ పేలుడు




- భయాందోళనలు పరుగులు తీసిన స్థానికులు
- భయం గుప్పెట్లో రజక వీధి ప్రజలు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన గోపాలపట్నం సిఐ, ఎస్ఐ
- మంట లారిపోయిన స్థానిక యువత
- పేలుడికి చుట్టుపక్కల ఇల్లు ధ్వంసం
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన వార్డు అధ్యక్షులు బొడ్డేటి విజయ్



విశాఖ, పశ్చిమ నియోజకవర్గం, గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన భారీ పేలుడు స్థానికుల్లో తీవ్ర భయాందోళన కలిగించింది. విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 89వ వార్డు ఆదర్శనగర్, ఎర్రచెరువు రజక కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం, రజక వీధిలో ఉన్న ఒక భవనంలో కొంతకాలంగా అనుమతి లేకుండా మందుగుండు సామగ్రి తయారీ జరుగుతున్నట్లు అనుమానాలు ఉన్నాయి. ఆదివారం అకస్మాత్తుగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పశ్చిమ నియోజకవర్గంలోని గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి సంభవించిన భారీ పేలుడు స్థానికుల్లో తీవ్ర భయాందోళనలకు దారితీసింది. ఆదర్శనగర్ ప్రాంతంలోని ఎర్రచెరువు రజక కాలనీలో ఉన్న ఒక భవనంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పేలుడు శబ్దం తీవ్రంగా వినిపించడంతో చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు ఒక్కసారిగా భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. స్థానికుల సమాచారం మేరకు, రజక వీధిలోని ఒక భవనంలో కొంతకాలంగా అనుమతి లేకుండా మందుగుండు సామగ్రి తయారీ జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం రాత్రి అకస్మాత్తుగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో ఆ భవనంలో మంటలు చెలరేగాయి. పేలుడు తీవ్రతతో భవనం భాగంగా ధ్వంసమవడంతో పాటు సమీప ఇళ్లకు కూడా నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు.

పేలుడు జరిగిన వెంటనే అక్కడ ఉన్న స్థానిక యువకులు ధైర్యంగా ముందుకు వచ్చి మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. వారి సహకారంతో మంటలు మరింతగా వ్యాపించకుండా అడ్డుకోగలిగారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు స్థానికులు పేర్కొన్నారు.

ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే గోపాలపట్నం పోలీస్ స్టేషన్ సీఐ సన్యాసి నాయుడు, ఎస్సై రామారావు తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. పేలుడు ఎలా జరిగింది? అక్కడ ఏ రకమైన పదార్థాలు నిల్వ ఉంచారు? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో ఆ భవనంలో అనధికారికంగా మందుగుండు సామగ్రి తయారీ జరుగుతున్న అవకాశాలు ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. బాంబులు శివ ఆ ఇంట్లో అతి కొంటూ మందు గుండి తయారు చేస్తున్నారని స్థానికుల ఆరోపిస్తున్నారు. భవన యజమాని వివరాలను సేకరిస్తూ, అక్కడ నిల్వ ఉంచిన పదార్థాల స్వభావం ఏమిటి అనే అంశంపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. అలాగే ఆ భవనంలో ఇంకా ప్రమాదకర పదార్థాలు ఉన్నాయా అనే విషయాన్ని నిర్ధారించడానికి జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఘటన స్థలాన్ని 89వ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి విజయ్ కూడా సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి భయాందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. ఈ ఘటనతో ఆదర్శనగర్, ఎర్రచెరువు రజక కాలనీ ప్రాంతాల్లో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు వెంటనే ఆ ప్రాంతంలో భద్రతా చర్యలు చేపట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చిందని పోలీసులు తెలిపారు. ఈ పేలుడుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మరిన్ని వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.





## కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

### పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ నిర్వహణకు ఏర్పాట్లు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 15 :** ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్క రించేందుకు విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్ర మాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ప్రజా సమస్య ల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)తో పాటు రెవె న్యూ క్లినిక్ కార్యక్రమాలు ఉదయం 9.30 గం టల నుంచి మధ్యాహ్నం వరకు జరుగుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులతో పాటు అన్ని శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వాటిపై చర్యలు చేపడ తారని చెప్పారు. ప్రజలు తమ సమస్యలకు సం బంధించిన అర్జీలను పూర్తి వివరాలతో సమర్పిం చాలని కలెక్టర్ సూచించారు.

అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ‘మీ కోసం’ కాల్ సెంటర్ 1100 సేవలను మరియు “మీ కోసం” వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే వివిధ శాఖలకు అంది న ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యలపై సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. సంబంధిత అధికారులు తమ శాఖల నివేదికలతో నిర్ణీత సమయానికి హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## మంత్రి గుమ్మడి సంధ్యారాణి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్



**పాడేరు, పెన్ పవర్, మార్చి 15:** మహిళా శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి వర్యులు గుమ్మడి సంధ్యారాణి జన్మదిన వేడుకలకు రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ హాజరయ్యారు. సాలూరులోని మంత్రివర్యుల నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిడారి శ్రావణ్ కుమార్ గారు మంత్రివర్యులు గుమ్మడి సంధ్యారాణి గారికి పూల మొక్క అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి గారు గిరిజనులు, మహిళలు మరియు శిశువుల సంక్షేమం కోసం చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ మంత్రి గారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యులు సాయిరాం, మాజీ పార్లమెంట్ కోశాధికారి వంతల నాగేశ్వరరావు, మాజీ మండల అధ్యక్షులు బుజ్జి బాబు, మాజీ ప్రధాన కార్యదర్శి ఆనందరావు, అనంతగిరి మండల ప్రధాన కార్యదర్శి గాలి నర్సిమ్మూర్తి, బాకూరు సర్పంచ్ వెంకట రమణ రాజు, దారేలా సర్పంచ్ పాండు రంగ స్వామి, మాజీ సర్పంచ్ వంతల పూర్ణ, టీడీపీ నాయకులు రమేష్, అప్పల రాజు, చిరంజీవి, రవీంద్ర ప్రసాద్, గంగులు సుందరరావు, సుశీల, పార్వతీపురం జీసీసీ డీఎం రామారావు, పార్వతీపురం, సాలూరు జీసీసీ మేనేజర్లు, జీసీసీ సిబ్బంది శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.




## పవన్ కళ్యాణ్ పర్యటన ఓ మధుర జ్ఞాపకం!

- గిరిజనకు గ్రామంలో జనసేన ఆవిర్భావ దినోత్సవం వేడుక పార్టీ నిరాడంబరతకు సాక్ష్యం
- జానపద కళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, మార్చి 15:** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని సుదూర ప్రాంత గిరిజన గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన ఓ మధుర జ్ఞాపకం అని గిరిజన కుగ్రామంలో జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుక పార్టీ నిరాడంబరతకు నిదర్శనమని రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంప్నరీరు గంగులయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గంగులయ్య మీడియాతో మాట్లాడుతూ పాడేరు మండలం కాడేలు పంచాయతీ పరిధిలోని వర్తనపల్లి, వంటలమామిడి పంచాయతీ నందిగరువు గ్రామాలను పవన్ కళ్యాణ్ సందర్శించి గిరిజనులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని కూడా ఈ సందర్భంగా గిరిజన కుగ్రామంలోనే నిరాడంబరంగా నిర్వహించారు అని అన్నారు. హెలిప్యాడ్ వద్ద నుంచి గ్రామాల వరకు సుమారు 2.5 కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లిన ఉప ముఖ్యమంత్రి మార్గమధ్యంలో ప్రజలతో మమేకమయ్యారు. విద్యార్థులతో కలిసి నడుస్తూ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చేపట్టిన రహదారి నిర్మాణ పనుల నాణ్యతను కూడా పరిశీలించారు. నందిగరువు గ్రామంలో నిర్వహించిన మాటామంతి కార్యక్రమంలో పాడేరు, అరకు నియోజకవర్గాలకు చెందిన గిరిజనులు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఉప ముఖ్యమంత్రికి వివరించారు. పలువురు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. అంధుడైన వ్యక్తికి రేషన్ డిపో మంజూరు చేయాలని సూచించగా, కుటుంబాన్ని కోల్పోయిన ఓ మహిళకు గృహ నిర్మాణం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూమి వివాదం విషయంలో ఫిర్యాదు చేసిన మహిళ సమస్యపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, వంతెనల నిర్మాణానికి సంబంధించిన సమస్యలపై కూడా అధికారులతో చర్చించి పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలతో నేరుగా మైక్ ఇచ్చి సమస్యలు వినడం ఈ సమావేశానికి ప్రత్యేకతగా నిలిచింది అని తెలిపారు. పర్యటనలో భాగంగా వర్తనపల్లి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ, రచ్చబండ పరిస్థితులను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి స్థానిక శివాలయాన్ని కూడా సందర్శించారు. గ్రామస్థులతో ముచ్చటిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివాసి గ్రామంలో ఆర్భాటాలకు తావు లేకుండా నిర్వహించడం ప్రత్యేకంగా నిలిచింది. గిరిజనుల ఆశీర్వాదాలతో జరిగిన ఈ కార్యక్రమం తమ ప్రాంతానికి గౌరవంగా భావిస్తున్నామని స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, గిరిజనులు పాల్గొన్నారు. మా గిరిజన ప్రాంతానికి వచ్చి మా సమస్యలను స్వయంగా విని కొన్నిటికి అక్కడికక్కడే పరిష్కరించి మరి కొన్ని పరిష్కార మార్గాలను సూచించి ప్రజా ప్రభుత్వానికి సరికొత్త నిర్వచనాన్ని ఇచ్చిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు మంత్రి నాదెండ్ల మనోహర్ కు ఆదివాసీల అందరి తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని గంగులయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయ రైతులను ప్రోత్సహించండి





**పర్యావరణాన్ని కాపాడడం మనందరి బాధ్యత – ఎమ్మెల్యే గొండు శంకర్**

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం మార్చి 15 :** శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలోని 80 అడుగుల రోడ్డులో పీడియాట్రిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "సిక్కోలు సంత" కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరై సంతను ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు, ప్రజలు, వైద్యులు మరియు ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో మొదటిసారిగా ఈ విధంగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలకు నేరుగా అందించే వారపు సంతను ప్రారంభించడం ఎంతో సంతోషకరమైన విషయమని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. తూర్పు కనుమల ప్రాంతాలలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు పండించిన వరి, పండ్లు, పప్పు ధాన్యాలు, తృణధాన్యాలు, కూరగాయలు, అలాగే విలువ ఆధారిత ఉత్పత్తులు, గానుగ నూనెలు వంటి సహజ మరియు సేంద్రియ ఉత్పత్తులను ఈ సంత ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తున్నారని చెప్పారు. ఇలాంటి సంతల ద్వారా రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే అవకాశం లభిస్తుందని, దీంతో రైతులకు మంచి ఆదాయం కూడా కలుగుతుందని ఆయన అన్నారు. మధ్యవర్తులు లేకుండా రైతులు నేరుగా ప్రజలకు ఉత్పత్తులను అందించడం ద్వారా రైతులకు లాభం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ప్రస్తుతం ప్రజలు ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ చూపుతున్న నేపథ్యంలో రసాయనాలు లేని సహజ ఆహార పదార్థాల వినియోగం చాలా అవసరమని ఎమ్మెల్యే చెప్పారు. "ఆహారమే ఆరోగ్యం" అనే సిద్ధాంతంతో ఈ సిక్కోలు సంత కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. సహజ వ్యవసాయం ద్వారా పండించిన ఆహార పదార్థాలు మన ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా భూమి ఆరోగ్యాన్ని కూడా కాపాడతాయని చెప్పారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణాన్ని రక్షించవచ్చని, భవిష్యత్ తరాలకు మంచి ప్రకృతిని అందించవచ్చని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మరింతగా ముందుకు రావాలని, ప్రజలు కూడా సేంద్రియ ఉత్పత్తులను వినియోగించి రైతులకు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

ఇలాంటి సంతలు జిల్లాలో మరిన్ని చోట్ల ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. రైతులు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి ప్రజల ఆరోగ్యం కోసం చేపట్టిన ఈ కార్యక్రమం జిల్లాలో ఒక మంచి ఆరంభమని తెలిపారు.

## 10వ తరగతి పరిక్షలకి హాజరవుతున్న విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం -- ఎమ్మెల్యే గొండు శంకర్

* ధైర్యంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 15** :ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రభుత్వం పగడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 6.42 లక్షల మంది విద్యార్థిని, విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతుండగా మొత్తం 3,415 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని, విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు హాల్ టికెట్ ఉన్న ప్రతి ఒక్క విద్యార్థికి ఉచిత బస్ బస్సు ప్రయాణం కల్పించినట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయాణంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో పరీక్షలను ఎటువంటి ఆటంకాలు లేకుండా సక్రమంగా నిర్వహించేందుకు అధికారులు పగడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు.అదే విధంగా విద్యార్థిని విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనవకుండా ధైర్యంగా, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. కష్టపడి చదివిన ప్రతి ఒక్కరు మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. అదేవిధంగా"అందరూ విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## జీడి పరిశ్రమపై ఎన్నికలలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 15 :** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో జీడికి గిట్టుబాటు ధర కల్పించి జీడి బోర్డ్ ఏర్పాటు చేస్తామన్న వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేసారు. పలాసలో సిపిఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకట్రావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాంద్ర ప్రకాష్, రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, సిపిఎం పార్టీ నాయకులు ఎన్ గణపతిలు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో జీడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి జీడి బోర్డు ఏర్పాటు చేస్తామన్న హామీని ఎప్పుడు అమలు చేస్తారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడ్ని ప్రశ్నించారు. గత ఆరు సంవత్సరాల నుండి జీడికి గిట్టుబాటు ధర కల్పించాలని అనేక ఆందోళనలు సాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. జీడి రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్ర దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిక్కల ధర పాతాళంలో ఉందని పప్పు ధర చూస్తే ఆకాశాన్ని అంటుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే జీడి రెండో స్థానంలో ఉందని అన్నారు. మన జిల్లాలో ఉద్దానం తీర ప్రాంతం మరియు గిరిజన ప్రాంతంలో విస్తారంగా జీడిపంటుందని, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతాంగం తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడికి గిట్టుబాటు ధర ఇవ్వడం వలన జీడి విస్తారంగా పండించి జీడి ఆధారత పరిశ్రమలు వస్తాయని, తద్వారా వేలాది మంది కార్మికులకు ఉపాధి దొరుకుతుందని, వలసలు నివారించబడతాయని తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని వారు అన్నారు. జీడికి మద్దతు ధర ఇవ్వడమంటే ఈ ప్రాంత అభివృద్ధి అన్నమాటని అన్నారు. జీడి 80 కేజీలు బస్తాకు 16 వేల రూపాయలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం జీడి బోర్డును ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జీడికి గిట్టుబాటు ధర ఇవ్వకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## విజ్ఞాన భారత పాఠశాలతో వైభవంగా 30వ వార్షికోత్సవ వేడుకలు






**కురుపాం, పెన్ పవర్, మార్చి 15 :** కురుపాం విజ్ఞాన భారతి పాఠశాలలో 30వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పిల్లలు, ప్రశంసలు, సాంస్కృతిక కార్యక్రమాలు, శారీరిక యోగ, ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. జిల్లా ప్రచారకులు శివ మాట్లాడుతూ నైతిక విలువలు, సర్వతీయ అభివృద్ధికి, భారతీయ విద్యా కేంద్రం పాఠశాలలు పెట్టింది పేరు ఇటువంటి పాఠశాలలు విద్యను, అభ్యసించడం అదృష్టంగా భావించాలని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో తల్లిదండ్రులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది , ముఖ్య అతిథి గా జిల్లా ప్రచారకులు శివ, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ గంపా గనేష్, కమిటీ సెక్రటరీ పాండురంగ రావు, చైర్మన్ నగేష్ పాల్గొన్నారు..

## పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు

**–జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్.**




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మార్చి 15 :** జిల్లాలో మార్చి 16 నుండి ఏప్రిల్ 1 వరకు నిర్వహించబడుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి పోలీసు శాఖ తరపున కట్టుదిట్టమైన పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రశ్నాపత్రాలు తరిలించేటప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అదేవిధంగా వాటిని భద్రపరిచేటప్పుడు సిసిటీవి కెమెరాల నిఘాలో భద్రపరచాలని, వాటిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారిచేశారు. పదవ తరగతి పరీక్షలు రాస్తున్న ప్రతి విద్యార్థికి ముందుగా శుభాకాంక్షలు తెలిపారు, పరీక్షలు సమయంలో విద్యార్థులు కష్టపడి చదివి ఎలాంటి భయం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులతో పాస్ అయి తల్లితండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, తమ బంగారు భవిష్యత్తుకు మంచి పునాదులు వేసుకోవాలని ఎస్పీ కోరారు. జిల్లాలో మొత్తం 119 పరీక్షా కేంద్రాలు ఉన్నాయని, పరీక్షలు నిర్వహణకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసామని జిల్లా ఎస్పీ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద శాంతి భద్రతలను కాపాడటానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తూ నిరంతర పర్యవేక్షణ చేపడతారన్నారు. ముఖ్యంగా పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గస్తీ పెంచినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో గుంపులుగా గుమిగూడకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సి.ఆర్.పి.సి./163 బి.ఎన్.ఎస్.ఎస్. అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల 100 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు అమలు చేయబడతాయని, ఈ పరిధిలో అనవసరంగా గుమికూడటం, సమావేశాలు నిర్వహించడం, మైక్‌లు ఉపయోగించడం పూర్తిగా నిషేధమని జిల్లా ఎస్పీ తెలిపారు. అలాగే పరీక్షల సమయంలో సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడం పూర్తిగా నిషేధం అని తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్‌లో సూచించిన సమయానికి ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా ప్రశ్నాపత్రాల లీక్ వంటి తప్పుడు ప్రచారం చేసి విధ్యార్థులను గందరగోళానికి గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయిల్ 100/112కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

## చింతపల్లిలో మంచినీటి సరఫరా-సర్పంచ్ దురియ పుష్పలత.



**చింతపల్లి పెన్ పవర్ మార్చి 15.** మండల కేంద్రం చింతపల్లిలో మంచినీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని నీటి సరఫరా చేపట్టినట్లు సర్పంచ్ దురియా పుష్పలత తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ వేసవికాలం కావడంతో చింతపల్లిలో పలు వీధులలో మంచినీటి ఎద్దడితో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ట్యాంకర్ ద్వారా మంచినీటి ఎద్దడి ఉన్న వీధులలో నీరు సరఫరా చేస్తున్నామన్నారు. నీరును ప్రజలు పొదుపుగా వాడుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చింతపల్లి మండలం ప్రతి వీధిలో సంత బజార్, మైలు కూలి వీధి, సాడిపేట, రామాలయం వీధి, సాయి నగర్ వీధి లలో ప్రతిరోజు నీటిని దగ్గరుండి సరఫరా చేస్తున్నట్లు ఆమె తెలిపారు. నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఆమె సూచించారు.

## పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ.



**చింతపల్లి పెన్ పవర్ మార్చి 15.** అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలం, లంబసింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన గసాడి వెంకటేశ్వర్లు కొండమ్మ దంపతులు శుక్రవారం పదవ తరగతి విద్యార్థులకు అట్టలు పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు దంపతులు మాట్లాడుతూ తాము కూడా ఇదే పాఠశాలలో గతంలో చదువుకున్నామని ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కొరకు ఎంతో కొంత సహాయం చేయాలని ఉద్దేశంతో సొంత నిధులతో పరీక్షలకు కావలసిన స్టేషనరీ ని సమకూర్చడం జరిగిందన్నారు. తాము చదువుకున్న పాఠశాలలో విద్యార్థులకు ప్రోత్సహిస్తూ 2022 సంవత్సరం నుండి పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు అట్టలు, (ప్లాంక్), పెన్నులు ఇతర వస్తువులను సమకూరుస్తున్నమన్నారు. పదవ తరగతి పరీక్షలు క్రమశిక్షణతో బాగా రాసి, విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని, అలాగే తల్లిదండ్రులకు మంచి పేరు వచ్చేలా ఉత్తీర్ణ సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు కొండమ్మ దంపతుల ప్రధమ కుమారుడు నూతన ప్రసాద్, జిహెచ్ఎస్ ఇన్చార్జి హెచ్ఎం బౌదు నారాయణరావు, జిపిఎస్ హెచ్ఎం సరమండ దిలీప్ కుమార్ మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## దారకొండలో 10వ తరగతి విద్యార్థులకు పెన్నులు, ప్లాంకులు పంపిణీ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి15:** దారకొండ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన సామగ్రిని అందజేశారు. మొత్తం 34 మంది విద్యార్థులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి బాబ్జీ చేతుల మీదుగా పెన్నులు, ప్లాంకులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించగలరని విద్యార్థులకు మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నడిగోట్ల రాజు, గ్రామస్థులు పిల్ల బుజ్జి, నడిగోట్ల సుధాకర్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ద

## భగవాన్ రామదూత స్వామిని దర్శించుకున్న "తెలుగు శక్తి " బి.వి.రామ్

* ప్రపంచంలో యుద్ధాలు నిలిచిపోయి శాంతి నెలకొనాలని ఆకాంక్ష
* ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం మరింతగా ప్రజల అభ్యున్నతికి కృషి చేయాలి



**విశాఖ మార్చ్ 15( పెన్ పవర్)**భగవాన్ శ్రీ శ్రీ శ్రీ రామదూత స్వామివారు 43వ అవధూతగా, దత్తాత్రేయ పరంపరలో విశ్వశక్తి స్వరూపంగా గుర్తింపు పొందారు ఆయనను తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ దర్శించుకున్నారు. ఋషికొండ సమీపంలోని పనోరమ హిల్స్, విల్లా నెంబర్ 85 లో వేంచేసి ఉన్న రామ దూత స్వామి ని ఆదివారం మధ్యాహ్నం వినపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం బి.వి.రామ్ మాట్లాడుతూ.. ఆయనను భక్తులు దత్తాత్రేయ అవతారంగా మరియు హనుమంతుని స్వరూపంగా భావిస్తారు. ఇరాన్ అమెరికా /ఇజ్రాయిల్ గల్ఫ్ దేశాలతో పాటు రష్యా ఉక్రైన్ మధ్య యుద్ధాలు సహా.. ప్రపంచంలో అనేక ప్రాంతాలలో యుద్ధాలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ రెండు దేశాల మధ్య యుద్ధం జరిగినా ఆ భారం సామాన్య ప్రజల పైన పడుతోందని, అనేకమంది ప్రాణాలు పోగొట్టుకోవడం లేదా గాయపడుతున్నారన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల బాల్యం ప్రశ్నార్థకంగా మారుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులలో తక్షణమే యుద్ధాలు నిలిచిపోయి శాంతి పరిస్థితులు ఏర్పడాలని స్వామీజీ వద్ద కోరుకున్నానని తెలిపారు. అదే విధంగా తెలుగు ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ప్రభుత్వం మరింత సానుకూలంగా స్పందించి మన ప్రాంత అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా రామధూత స్వామిని.. సామాన్య ప్రజలతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర రంగాల ప్రముఖులు దర్శించుకుని ఆశీస్సులు పొందుతుంటారని బి.వి.రామ్ తెలిపారు. లోక కళ్యాణార్థం పాటుపడుతున్న రామధూత స్వామి లాంటి వారి వల్ల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు.


కలిసిన వారిలో ఫిలిం డైరెక్టర్ వి.వంశీ బాబు, బీసెట్టి నారాయణరావు తదితరులు ఉన్నారు.

# రైతన్న మీకోసం వారోత్సవాలను విజయవంతం చేయాలి

**రైతు సంక్షేమ పథకాలపై ఇంటింటా అవగాహన**

**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, మార్చి 15:** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని నిర్వహిస్తున్న "రైతన్నమీకోసం వారోత్సవాలు" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జి.కె.వీధి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రైతుతో ప్రత్యక్షంగా అనుసంధానం ఏర్పరచుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు ముఖ్యంగా సూపర్ సిక్స్‌లో భాగంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 22వ విడత నిధుల విడుదల, అలాగే అన్నదాత సుఖీభవ పథకం క్రింద మూడో విడత పెట్టుబడి సాయం పంపిణీ వంటి అంశాలను ప్రతి రైతుకు వివరించాలని సూచించారు. వ్యవసాయం మరియు అనుబంధ రంగాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనుసరిస్తున్న పంచసూత్రాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని మార్చి 16, 17, 18, 23, 24, 25 తేదీల్లో ఇంటింటికి వెళ్లి రైతులను కలుస్తూ నిర్వహించాలని తెలిపారు. రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిన ఆర్థిక సాయంపై వివరాలు తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జులు, బూత్ యూనిట్ ఇంచార్జులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, మండల మరియు గ్రామ స్థాయి అనుబంధ కమిటీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. రైతులను కలిసిన సందర్భంగా తీసిన ఫోటోలు, వీడియోలను మై టీడీపీ యాప్‌లో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని సూచించారు.






## శారీరక శ్రమతో సంపూర్ణ ఆరోగ్యం.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార అధ్యక్షులు వలి రెడ్డి..




**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 15** .ప్రతి ఒక్కరూ శారీరిక శ్రమతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించగలరని జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రచార అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు సూచించారు. చీపురుపల్లి పట్టణంలో ఆదివారం నాడు అపోలా మెడికల్ షాప్ మేడ పైన నూతనంగా అత్యాధునిక పరికరములుతో రెపక్స్ట్రేమ్ జిమ్మును ఆయన ప్రారంభించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ మనిషి జీవితం లో ఫిట్ నెస్ ఎంతో ముఖ్యమైనదని చీపురుపల్లి పట్టణంలో అన్ని వసతులు ఉన్న సరిఅయిన జిమ్ లేక యువత,ఎదురు చూస్తున్న తరుణంలో ఈరోజు మంచి ఏక్విప్మెంట్ తో అదునాతన సౌకర్యంతో జిమ్ కోచ్ ప్రసాద్ కొత్త జిమ్ ని చీపురుపల్లి ప్రజలకు యువతకు పరిచయం చేయడం చాలా ఆనందం ఉంది అన్నారు, ప్రసాద్ మంచి ట్రైనింగ్ లో ఎంతోమంది క్రీడాకారులను ప్రపంచ స్థాయి లో ఇప్పటికే పరిచయం చేశారు అన్నారు. శారీరక దృఢత్వం చెందడం వలన చురుకుగా ఉండటానికి మరియు ఆరోగ్యకరమైన శరీర బరువును నిర్వహించడానికి సహాయపడుతుంది అని
కండరాల బలం,మరియు ఓర్పును మెరుగుపరుస్తుంది అన్నారు అదేవిధంగా మానసిక ఒత్తిడిని తొలగించడానికి
క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయడం ద్వారా ఒత్తిడి, ఆందోళన నిరాశను తగ్గిస్తుంది అని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభాత్ కుమార్, యస్. వి. జి. శ్రీను, డోలా నాగరాజు, దన్నాన సత్యం, రాంకీ తదితరులు పాల్గొన్నారు

## అక్షరాస్యత తోనే అభివృద్ధి సాధ్యం.. డి డి ఓ హేమ సుందర్..



**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 15 .** ప్రతి ఒక్క మహిళ అక్షరాస్యత పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా సామాజిక అభివృద్ధి సాధ్యపడుతుందని చీపురుపల్లి డి డి ఓ కే హేమ సుందర్ అన్నారు. ఆదివారం నాడు చీపురుపల్లి మండలం చిన్న నడిపల్లి గ్రామంలో జరుగుతున్న అక్షరాంధ్ర పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక పొదుపు సంఘాలలో సభ్యులుగా ఉంటున్న ప్రతి ఒక మహిళ అక్షరాస్యులు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పిలుపుమేరకు నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాల్లో భారీ స్థాయిలో మహిళలు పాల్గొనడం హర్షనియమన్నారు. ఇంటికి దీపం ఇల్లాలు అనే నానుడికి దీటుగా ప్రతి ఒక్క మహిళ అక్షరాసులు కావడం ద్వారా కుటుంబం మొత్తం అక్షరాశులుగా పెంపొందడానికి అవకాశం ఉందన్నారు. చదువు మనకెందుకులే అనుకునే మూఢనమ్మకాలను విడనాడి ప్రతి ఒక మహిళ అక్షరాసులు కావాలని ఆయన కోరారు. చీపురుపల్లి పట్టణ పరిధిలోని జరిగిన పలు అక్షరాంధ్ర పరీక్ష కేంద్రాలను స్థానిక ఎంపీడీవో ఐ సురేష్, విద్యాశాఖ అధికారులు బూసి నాయుడు, విజయ్ కుమార్ చీపురుపల్లి మండల సమాఖ్య అధికారి అప్పలనాయుడు తదితర శాఖల అధికారులు పాల్గొని పరీక్షల నిర్వహణను పరిశీలించారు.

## గ్రీవెన్స్ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి ... డి డి ఓ హేమ సుందర్.



**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 15.** విజయనగరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రీవెన్స్ నుండి వస్తున్న ఫిర్యాదులను తక్షణమే మండల స్థాయి అధికారులు పరిష్కారాలు చూపాలని చీపురుపల్లి డి డి ఓ కే . హేమ సుందర్ అధికారులకు సూచించారు. ఆదివారం నాడు చీపురుపల్లి మండలంలోని పలు గ్రామాలను పర్యటించి గ్రీవెన్స్ లో వచ్చిన ఫిర్యాదులు మేరకు సంబంధిత ఫిర్యాదు దారులతో ఆయన మాట్లాడారు. అసంతృప్తి గా ఉన్న గ్రీవెన్స్ లను పిర్యాదుదారులతో మాట్లాడి, వెరిఫై చేయడం జరిగింది. ఎందుకు అసంతృప్తి గా ఉన్నారు, ఇంకా ఎంతవరకు పని కావాల్సి ఉంది అని అడిగి ఆయన తెలుసుకున్నారు.
మండలం లో పలు గ్రామాలనుండి వస్తున్న గ్రీవెన్స్ (పిర్యాదులను) లను వెంటనే పరిష్కరించాలి అని ఆయన సూచించారు. డిపార్ట్మెంట్ లు వారిగా, రెవెన్యూ పంచాయతీరాజ్ పోలీస్ శాఖ, రిజిస్ట్రేషన్ శాఖలకు వస్తున్న పిర్యాదులను పరిష్కరించి, ప్రజలలో సంతృప్తి స్థాయిలను పెంచాలని ఆయన సూచించారు. ప్రధానంగా వచ్చిన గ్రీవెన్స్ లు పరిష్కారం కాక, ఒకవేళ పరిష్కారం అయినా పూర్తి స్థాయిలో పరిష్కారం కాకపోవడం వలన అసంతృప్తి పెరుగుతుందన్నారు. తద్వారా మండల, జిల్లా ర్యాంకులు పడిపోతున్నాయి అని ఆయన అధికారులకు వివరించారు. దీని కారణంగా ప్రజల అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని ఆయన కోరారు

# అల్లూరి సీతారామరాజు జిల్లాలో 10వ తరగతి పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

**జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, ఐపీఎస్**

**పాడేరు, పెన్ పవర్, మార్చి 15:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో 10వ తరగతి (రాజ) పబ్లిక్ పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అమిత్ బర్దార్, ఐపీఎస్ తెలిపారు.
జిల్లా వ్యాప్తంగా మొత్తం 72 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయబడినట్లు ఆయన తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమల్లో ఉంచబడింది. పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ (ఫోటోకాపీ) దుకాణాలు పరీక్షల సమయంలో మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు.
పరీక్షా కేంద్రాల వద్ద అనుమతి లేని వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు. పరీక్షల విధులకు నియమించబడిన ఇన్విజిలేటర్లు మరియు సిబ్బంది మాత్రమే కేంద్రాలలోకి ప్రవేశించేందుకు అనుమతి ఉంటుందని ఎస్పీ తెలిపారు.
అలాగే పరీక్షలు రాసే విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, పరీక్షా నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
10వ తరగతి పరీక్షలు మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు ప్రతిరోజూ ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:45 వరకు నిర్వహించబడతాయి. పరీక్షలు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖ అన్ని చర్యలు చేపట్టింది.
ప్రశ్నపత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలించే సమయంలో మరియు సమాధాన పత్రాలను సేకరించే సమయంలో పోలీసు ఎస్కార్ట్ అందించబడుతుంది.
సెక్షన్ 144 అమల్లో ఉండడంతో పరీక్షా కేంద్రాల వద్ద బయటి వ్యక్తులు గుమికూడకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అలాగే మాస్ కాపీయింగ్ లేదా ఇతర అక్రమాలకు అవకాశం లేకుండా జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశించారు.
అన్ని పరీక్షా కేంద్రాల వద్ద తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షల సమయంలో మొబైల్ పట్రోలింగ్ బృందాలు మరియు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తాయి.
పరీక్షల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ముందుగానే పంపించాలని సూచించారు.
పరీక్షా విధుల్లో ఉన్న అధికారులు మరియు విద్యార్థులు అందరూ పరీక్షా నియమాలు కచ్చితంగా పాటించాలి. ఇన్విజిలేటర్లు మరియు అధికారిక సిబ్బంది తప్ప ఇతరులు కేంద్రాల్లోకి అనుమతించబడరు.
విద్యార్థులు చీట్లు, పుస్తకాలు లేదా ఇతర అనధికారిక వస్తువులు తీసుకురావడం నిషేధం. మాస్ కాపీయింగ్ లేదా ఇతర అక్రమాలకు




పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.
అదనంగా, ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ రాజ మార్చి 2026 పరీక్షలు కూడా మార్చి 16 నుంచి మార్చి 28 వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు నిర్వహించబడతాయి. ఈ పరీక్షలలో కూడా అన్ని నియమాలు తప్పనిసరిగా పాటించాలి.
జిల్లాలోని ఏ పరీక్షా కేంద్రం సమీపంలో అనుమానాస్పద సంఘటనలు జరిగినా వెంటనే 100 లేదా 112 కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ ప్రజలను కోరారు.
ముఖ్య సూచనలు:
అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమల్లో ఉంటుంది.
పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ దుకాణాలు పరీక్షల సమయంలో మూసివేయాలి
ఇన్విజిలేటర్లు మరియు అధికారిక సిబ్బంది మాత్రమే కేంద్రాల్లోకి అనుమతి
అనుమతి లేని వ్యక్తులు కేంద్రాల వద్ద గుమికూడరాదు
విద్యార్థులు చీట్లు, పుస్తకాలు లేదా ఇతర నిషేధిత వస్తువులు తీసుకురావద్దు
మాస్ కాపీయింగ్ లేదా ఇతర అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు
విద్యార్థులు సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి
తల్లిదండ్రులు పిల్లలను ముందుగానే కేంద్రాలకు పంపాలి
అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే 100 లేదా 112 కు సమాచారం ఇవ్వాలి అని తెలిపారు.

# దాడుల్లో 13 సిలిండర్లు స్వాధీనం...కేసు నమోదు

**విజయనగరం టౌన్, పెన్ పవర్,మార్చ్ 15** : నెల్లిమర్ల మండల పరిధిలో పౌర సరఫరాల శాఖాధికారులు ఆదివారం చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘిస్తున్న పలువురు వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకున్నారు. అక్రమంగా గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచిన మరియు వినియోగిస్తున్న ప్రాంతాలపై జరిపిన దాడుల్లో మొత్తం 13 గ్యాస్ గృహావసర సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా, జాయింట్ కలెక్టర్ ఎస్ సేధు మాధవన్ ఆదేశాల మేరకు, ఈ దాడులు నిర్వహించారు. అక్రమంగా సిలిండర్లను నిల్వ ఉంచినందుకు మరియు గృహ అవసరాలకు వాడే సిలిండర్లను వాణిజ్య అవసరాలకు మళ్లించినందుకు సంబంధించి ఐదుగురిపై 6ఏ కేసులు నమోదు చేయడం జరిగింది. ?ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్ల అక్రమ రవాణా లేదా నిల్వ చేసినా, గృహ అవసరాల సిలిండర్లను హోటళ్లు, ఇతర వాణిజ్య సంస్థలకు తరలించినా చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా డీఎస్ఓ మురళీనాథ్ హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి తనిఖీలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.




## అక్షర ఆంధ్ర పరీక్షలు నిర్వహించిన ఎన్.ఆర్.జి.ఎస్,వెలుగు

* మహిళలను అక్షరాశ్యులుగా తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వ రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం.




**గుమ్మలక్ష్మీపురం మార్చి 15 పెన్ పవర్.** గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు పంచాయితీ పరిధిలోని బయ్యాడ,రేగిడి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మరియు వెలుగు సమస్త ఆధ్వర్యంలో ఆదివారం నాడు మహిళలకు అక్షర ఆంధ్ర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నికి పర్యవేక్షణ అధికారులుగా ఎంఈఓ చంద్రశేఖర్,ఎంపీడీవో. శ్రీనివాసరావు ను నియమించారు. వారి పర్యవేక్షణలో అక్షర ఆంధ్ర పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ మేరకు వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఉన్న నిరక్షరాష్యులైన మహిళలను అక్షరాశులుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం యొక్క లక్ష్యమని వారు పేర్కొన్నారు. పంచాయతీలో మూడు కేంద్రాలు కలిపి సుమారుగా 142 మంది హాజరయ్యారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్ దాస్. మరియు మేట్లు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలి...డా.శైలజ



**కురుపాం, పెన్ పవర్, మార్చి 15 :** జాతీయ పశువ్యాధి నియంత్రన పథకం, ప్రభుత్వ పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 29 వ తేదీ వరకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుంది అని మండల పశువైద్యులు డా. శైలజ తెలిపారు.. పశుపోషకులు గాలికుంటు వ్యాధి వల్ల ఆర్ధికంగా నష్టం వస్తుందని పశువులకు వ్యాధి ముదిరిన యెడల ప్రాణనష్టం కూడా ఉంటుందని, నోటిలో లాలజాలం రావడం, పుండ్లు,కాలి గిట్టల దగ్గర పుండ్లు ఉండటం, సరిగ్గా నడవలేకపోవడం వంటి సమస్యలు వస్తాయని,ఈ వ్యాధి ఆవులు, గేదెలు, ఎద్దులు, మేకలు, గొరెలలో ఈ వ్యాధి ఎక్కువగా కనిపించే భయంకరమైన అంటువ్యాధి అని తెలిపారు. ఈ వ్యాధి సోకిన పశువులు పాల దిగుబడి తగిపోతుంది కావున రైతుసోదరులు 3నెలల వయసు పైబడిన పశువులకు గాలికుంటు టీకాలు వేయించుకోకోవాలని సూచించారు. ప్రతీ గ్రామానికి వచ్చి పశు సంవర్ధక శాఖ సిబ్బంది టీకాలు వేయడం జరుగుతుంది, పశుపోషకులు ఈ అవకాశని సద్వినియోగం చేసుకోవాలని అని ఆమె తెలిపారు.

# టిడిపి ఎమ్మెల్యే, ఎంపీలపై వైఎస్ షర్మిల ఫైర్



**విజయనగరం టౌన్, పెన్ పవర్, మార్చి 15:** బొబ్బిలి నియోజకవర్గం, పారాది గ్రామ ప్రజలతో ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎ పరిరక్షణ రచ్చబండ కార్యక్రమంలో పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పాల్గొన్నారు. రచ్చబండ వేదికగా బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తమ భూమిని కబ్జా చేస్తున్నారని మల్లంపేట గ్రామస్థులు వైఎస్ షర్మిల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థులు ఎదుటే రచ్చబండ వేదికగా స్థానిక ఎమ్మెల్యేతో ఫోన్ లో మాట్లాడిన పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల, 1995 నుంచి సాగుచేసుకుంటున్న 7 ఎకరాల పేదల భూములు ఎలా కబ్జా చేయాలని చూస్తారని ఎమ్మెల్యేను నిలదీసారు. అయితే స్థానిక ఎమ్మెల్యే నేను కలిసి పూర్తి వివరాలు వెల్లడిస్తానంటూ ఫోన్ కట్ చేయడంతో, వెంటనే కలెక్టర్ కు ఫోన్ చేసి సమస్య పరిష్కరించాలని షర్మిల విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఓట్లేసి గెలిపించినందుకు ఎమ్మెల్యే భూ భక్షకుడు అయ్యాడంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన వైఎస్ షర్మిలా రెడ్డి.

ఇదిలా ఉండగా మొయినాబాద్ డ్రగ్స్ పార్టీలో ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ దొరకడం సిగ్గుచేటని, ఢిల్లీలో పార్లమెంట్ జరుగుతుంటే ఈ ఎంపీ ఇక్కడ కొకైన్ తో విందు చిందు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ఇదెక్కడి భాధ్యతారాహిత్యం అంటూ షర్మిల ప్రశ్నించారు. డ్రగ్స్ టెస్ట్ లో పాజిటివ్ వచ్చింది కదా.. ఇప్పుడు చంద్రబాబు ఎం చర్యలు తీసుకుంటారు అంటూ చంద్రబాబును సైతం ప్రశ్నించారు ఆమె, డ్రగ్స్ తీసుకుంటూ పట్టబడ్డ ఎంపీ సమాజానికి ఏం మెసేజ్ ఇస్తున్నాడని, యువత డ్రగ్స్ వాడాలని ఎంపీ ఎంకరేజ్ చేస్తున్నారా అంటూ ఎద్దేవ చేశారు. ఎంపీ పదవి నుంచి పుట్టా మహేష్ ను వెంటనే తొలగించాలనీ, పార్టీ నుంచి వెంటనే సస్పెన్షన్ చేయాలంటూ వైఎస్ షర్మిలా రెడ్డి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్రగ్స్ పై నిజంగా ఉక్కుపాదం మోపితే ఎంపిపై చర్యలు తీసుకొని చంద్రబాబు చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు.

## శ్రీకాకుళం పట్టణంలో పోలీసు జాగిలంతో విస్తృత సోదాలు

- బస్ కాంప్లెక్స్ పరిసరాలు, పార్సిల్ సర్వీసులు.
- దుకాణాలలో తనిఖీలు.




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 15:** శ్రీకాకుళం పట్టణంలో పోలీసు జాగిలంతో విస్తృతంగా తనిఖీలు, సోదాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం గంజాయి, అక్రమ మద్యం వంటి మత్తు పదార్థాలు, పేలుడు పదార్థాల అక్రమ నిల్వలు మరియు రవాణాను అరికట్టేందుకు చేపట్టిన ప్రత్యేక చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించారు. శ్రీకాకుళం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై రామారావు ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఆవరణలో పోలీసు జాగిలంతో అనుమానాస్పద ప్రదేశాల్లో తనిఖీలు చేపట్టారు. బస్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో ఉన్న పార్సిల్ సర్వీసులు, దుకాణాలు మరియు ప్రైవేట్ ట్రావెల్స్ కార్యాలయాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు.

ఈ క్రమంలో ప్రతి షాప్, దుకాణంలో పోలీసు జాగిలం సహాయంతో తనిఖీలు నిర్వహించి, ప్రయాణికుల లగేజీ బ్యాగులు మరియు పార్సిల్ సర్వీసులను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు మరియు నిషేధిత పేలుడు పదార్థాల అక్రమ రవాణా, నిల్వలను గుర్తించేందుకు ప్రత్యేకంగా ఈ సోదాలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

ఇలాంటి తనిఖీలు జిల్లాలో నిరంతరం కొనసాగిస్తూ అక్రమ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీసులు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## రోడ్డు భద్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన

## -హెల్మెట్ పెట్టుకొని వాహనదారులకు మొక్కలు పంపిణీ

- హెల్మెట్ ప్రాణాన్ని రక్షిస్తుందని, మొక్క వాహన కాలుష్యాన్ని నియంత్రిస్తుందని అవగాహన కల్పించిన చిన్నారి సాహితి







**గాజువాక :పెన్ పవర్ ,మార్చి 15** పారిశ్రామిక ప్రాంతం గాజువాక పోలీస్ స్టేషన్ జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనదారుల్లో రోడ్డు భద్రత మరియు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ప్రత్యేక కార్యక్రమం ఐ స్టాండ్ ఫర్ నేషన్ జయభారత అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 13 ఏళ్ల చిన్నారి సాహితీ వాహనదారులకు మొక్కలను అందజేసి హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని, అలాగే మొక్కలు వాహన కాలుష్యం నుండి పర్యావరణాన్ని రక్షిస్తాయని అవగాహన కల్పించింది. గాజువాక ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ శాంతారామ్ మాట్లాడుతూ రోడ్డు భద్రతతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమన్నారు . గాజువాక ట్రాఫిక్ పోలీస్ లు , ఆంధ్రప్రదేశ్ లాయర్స్ అసోసియేషన్ విశాఖపట్నం ప్రెసిడెంట్ కాండ్రేగుల లీల హరిప్రసాద్, జయభారత్ అసోసియేషన్ సెక్రటరీ ఆదిల్, ట్రాఫిక్ సోల్జర్ స్థానికులు మరియు స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్.

మంత్రి గుమ్మడి సంధ్యారాణి కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్.తోయక జగదీశ్వరి.



**గుమ్మలక్ష్మీపురం మార్చి 15 పెన్ పవర్.** రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డస్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు గుమ్మిడి సంధ్యారాణి జన్మదినం సందర్భంగా సాలూరులో వారి స్వగృహమందు ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ,గిరిజన సంక్షేమం,మహిళా మరియు శిశు అభివృద్ధి కోసం మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.మంత్రి కి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్ కలగాలని, ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి పార్టీ శ్రేణులకు పిలుపు



- 2019లో పవన్ కల్యాణ్ పై గెలిచాను.. నేటికీ మర్చిపోలేను:నాగిరెడ్డి

**గాజువాక:పెన్ పవర్ ,మార్చి 15** వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసీపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. జీవీఎంసీ 71 వ వార్డు శ్రీనగర్ లో వార్డు ఇంచార్జి భూపతిరాజు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఇటీవల వైసీపీ పీఏసీ సభ్యులుగా నియమితులైన తిప్పల నాగిరెడ్డి,రాష్ట్ర పార్టీ మహిళా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన భూపతిరాజు సుజాతలకు అభినందన సత్కార కార్యక్రమం లో ముఖ్య అతిథి పాల్గొన్నారు . పనిచేసిన ఐదేళ్లలో గాజువాకలో అపరిష్కృత సమస్యలను పరిష్కరించానని తెలిపారు.ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అన్నింటినీ అమలు చేసిన ఘనత వైఎస్ జగన్ కే దక్కుతుందని అన్నారు.తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.పవన్ కల్యాణ్ పై తాను పోటీకి దిగినప్పుడు దేశం మొత్తం గాజువాక నియోజకవర్గం వైపు చూసిందని ఆ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ను ఓటు అనే ఆయుధంతో గాజువాక ప్రజలు ఇంటికి పంపించారని .వైసీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావలసిన ఆవశ్యకత ఉందని, ఈసారి ఎన్నికల్లో దేవన్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ఆ దిశగా ప్రతి కార్యకర్త కష్టించి పనిచేయాలని తిప్పల కోరారు.అనంతరం రాష్ట్ర పార్టీ మహిళా ప్రధాన కార్యదర్శి భూపతిరాజు ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, నాయకుడు మళ్ల రవికుమార్,పార్టీ నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# 87వ వార్డ్ లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన






-సంతమామిడి తోట శివాలయం ఓపెన్ చాట్ ప్రారంభోత్సవం

**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,మార్చి 15 :** మహా విశాఖ నగరపాలక సంస్థ 87వ వార్డ్ పరిధిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డ్ కార్పొరేటర్ బొండా జగన్నాధం పాల్గొన్నారు. కాశీ పాలెం , వడ్లపూడి శెట్టిబలిజ వీధిలో ఉన్న సిసి రోడ్ , సీసీ కాలువ శిధిలావస్థకు చేరుకోవడం తో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని. ఫిర్యాదులు రావడం తో జీవీఎంసీ నిధులు 19.70 లక్షల సిసి రోడ్లు ,సిసి కాలవలు మరియు సొంతమామిడి తోట శివాలయం షడ్డుకు 19 98 లక్షలు మంజూరు చేయించడం జరిగిందని. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా కృషి చేస్తుందని బొండా అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు విజయరామరాజు, జనసేన అధ్యక్షుడు సిరసపల్లి కనకరాజు, సెక్రెటరీ బొట్టా ప్రకాష్, బెల్లంకొండ రాజన్ రాజ్, డీవీ అప్పారావు, కాండ్రేగుల శ్రీనివాస్ నాయుడు, కణితి ఈశ్వరరావు, వై. భాస్కరరావు, జీవీ రమణ, గండిమాన కనకరాజు, శ్రీరామ్ మూర్తి, వెంకటరావు.వేణు, సూర్యనారాయణ.ఆలయ కమిటీ బంటు వీర్రాజు. సతీష్. పద్మావతి. వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మాధవధార, సింహాచలం ట్రెకింగ్‌లో ప్లాస్టిక్ రహిత సందేశం





**విద్యార్థులకు ఆదర్శంగా ఏబీవీపీ, ఆర్‌ఎస్‌ఎస్ బృందం**

**ప్రకృతి పరిరక్షణపై చైతన్యం**

**సింహాచలం, పెన్ పవర్, మార్చి 15 :** ప్రకృతిని ప్రేమించాలి, పర్యావరణాన్ని కాపాడాలి అనే నినాదంతో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్ ఆంధ్ర యూనివర్సిటీ విభాగం మరియు 'ఖేలో భారత్' సంయుక్తంగా నిర్వహించిన వినూత్న కార్యక్రమం ఆదివారం సింహాచల పుణ్యక్షేత్రంలో ఘనంగా ముగిసింది. మాధవధార నుంచి సింహాచలం వరకు కొండ మార్గంలో నిర్వహించిన ఈ ట్రెకింగ్ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల్లో చైతన్యం కల్పించింది. ఆర్గనైజర్‌గా, సభ్యులు కిరణ్ మరియు చందు నేతృత్వంలో సుమారు వందలాది మంది ఏబీవీపీ, ఆర్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఈ ఉదయం మాధవధార నుంచి ట్రెకింగ్ ప్రారంభించారు. కేవలం విహారం కోసం కాకుండా "ప్రకృతి ప్రేమలో ప్లాస్టిక్ నిషేధం" అనే ప్రధాన ఉద్దేశంతో ఈ యాత్ర సాగింది.

ట్రెకింగ్ మార్గమధ్యంలో భక్తులు విసిరేసిన ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు మరియు ఇతర వ్యర్థాలను విద్యార్థులు సేకరిస్తూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ చర్య ద్వారా పవిత్రమైన సింహాచలం కొండ మార్గాన్ని శుభ్రంగా ఉంచడంలో విద్యార్థులు తమ బాధ్యతను చాటుకున్నారు.

సింహాచలం చేరుకున్న అనంతరం ఈ బృందాన్ని శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి జె. వెంకట్రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నేటి యువత ప్రకృతి పట్ల చూపిస్తున్న బాధ్యత ఎంతో అభినందనీయం. పవిత్రమైన పుణ్యక్షేత్రాలను ప్లాస్టిక్ రహితంగా ఉంచడంలో విద్యార్థుల పాత్ర కీలకం. ఈ బృందం చేసిన కృషి ఇతర స్వచ్ఛంద సంస్థలకు మార్గదర్శకంగా నిలుస్తుంది," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డి.ఇ ఐ.సి రామరాజు, సహాయ కార్యనిర్వహణ అధికారి వాడ్రేవు రమణమూర్తి, పీఆర్వో నాయుడు, ఇతర ఆలయ సిబ్బంది మరియు అధిక సంఖ్యలో స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు. ఈ ట్రెకింగ్ కార్యక్రమం ద్వారా ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యార్థులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలు కొనసాగించాలని వారు సంకల్పించారు.

# రైతన్న మీకోసం వారోత్సవాలను విజయవంతం చేయండి.

- అరకు నియోజకవర్గం ఇంచార్జీ.ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం జోనల్ చైర్మన్ దొన్నుదొర.




**అరకులోయ పెన్ పవర్ 15:** ఆంధ్రప్రదేశ్ లో ప్రతి రైతుతో ప్రత్యక్ష అనుసంధానం ఏర్పరచుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతన్న మీకోసం వారోత్సవాలు బృహత్తర వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహణకు కూటమి ప్రభుత్వం పిలుపునిచ్చింది. వారోత్సవాల ద్వారా రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కీలక పథకాలను వివరిస్తూ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 22వ విడత నిధుల విడుదల అన్నదాత సుఖీభవ పథకం మూడో విడత పెట్టుబడి సాయం పంపిణీ అంశాలను క్షేత్రస్థాయిలో ప్రతి అన్నదాతకు చేరువు చేయడమే లక్ష్యంగా

వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలను ప్రతి రైతుకు చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అనుసరిస్తున్న పంచ సూత్రాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశంగా మార్చి 16,17, 18, 23, 24, 25 తేదీలలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం రైతులు ఖాతాల్లో జమ చేసిన ఆర్థిక సాయం గురించి వివరించండనీ.పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులపై విజయవంతం చేయడంలో క్లస్టర్ ఇంచార్జిలు భూత్ ఇంచార్జిలు, గ్రామ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనాలని రైతు ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన ఆర్థిక సాయం గురించి వివరిస్తున్నారో, సంబంధించిన ఫోటో వీడియో పై టిడిపి యాప్ లో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని అరకు ఇంచార్జి దొన్నుదొర ఆదివారం ఒక పత్రిక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## శ్రీ స్వామివారిని దర్శించుకున్న ఐపిఎస్ అధికారి జె.రామ్మోహన్ రావు



**సింహాచలం, పెన్ పవర్, మార్చి 15 :** శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం సింహాచలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం ఎస్పీ జె. రామ్మోహన్ రావు సతీ సమేతంగా శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. ఇటీవల రాష్ట్ర పోలీస్ సేవ నుంచి ఐపిఎస్ కేడర్‌కు పదోన్నతి పొందిన అనంతరం స్వామివారి ఆశీస్సులు పొందేందుకు ఆయన ఆలయానికి విచ్చేశారు.

ఆలయానికి చేరుకున్న రామ్మోహన్రావు దంపతులకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు, ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్యులు మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు.

ఆలయ సంప్రదాయం ప్రకారం రామ్మోహన్ రావు కప్పస్తంభాన్ని ఆలింగనం చేసి, అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. అనంతరం దేవస్థానం తరఫున రామ్మోహన్ రావు దంపతులను శేషవస్త్రంతో సత్కరించారు. ఈవో స్వామివారి ప్రసాదాలతో పాటు జ్ఞాపికగా స్వామివారి చిత్రపటాన్ని వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరావు, పర్యవేక్షణాధికారి కె. వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# రప్పా.. రప్పా మాటకు మెగా బ్రదర్ డైరెక్ట్ పంచ్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఓటమి నుంచి తప్పుల్ని పాఠాలుగా నేర్చుకోవటం అందరూ చేసేదే. కానీ.. తమకు ఎదురైంది ఘోర ఓటమి కాదు.. అందరూ కలిసి కుట్ర పన్నారన్న మైండ్ సెట్ తో ఉంటే..? వైసీపీ అధినేత మొదలు వైసీపీ కార్యకర్త వరకు అందరూ అలాంటి మైండ్ సెట్ లో ఉండటమే ఆసక్తికర అంశం. తమను ఓడించేందుకు మూడు పార్టీలు కలిసి కూటమిగా బరిలోకి దిగటం వల్లే ఓడామని.. అలా జట్టు కట్టిన తర్వాత కూడా ఏదేదో చేశారన్న సందేహాలతో తమ ఓటమికి జస్టిఫికేషన్ ఇచ్చుకోవటం చూసినప్పుడు వైసీపీ వారి మైండ్ సెట్ కు విస్మయం చెందాల్సిందే.

సాధారణంగా ఎదురుదెబ్బలు తగిలినప్పుడు.. వాటి నుంచి పాఠాలు నేర్చుకొని.. ఆ తప్పులు మళ్లీ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవటం కనిపిస్తుంది. కానీ.. వైసీపీ వారి నుంచి అలాంటివి ఆశించలేం. అందుకే.. సినిమాల్లోనే వెగటు కలిగించే రప్పా..రప్పా నరికేస్తామనే హింసాత్మక డైలాగ్ ను మరింత సినిమాటిక్ గా రియల్ లైఫ్ లో పార్టీ నినాదంగా మార్చటానికి మించిన తెగింపు ఇంకేం ఉంటుంది? కార్యకర్త మొదలు చిన్నపాటి నేత అత్యుత్సాహంతో అడుగులు వేస్తున్నప్పుడు.. అతడ్ని సరిదిద్దాల్సిన బాధ్యత పార్టీ ముఖ్యుల మీద ఉంటుంది. వారేమో రప్పా రప్పా నరుకుతామంటే.. అదేం సరిపోతుంది? మరింత మోతాదు పెంచదన్న రీతిలో వైసీపీలోని కొందరు తీరు..ఆ పార్టీపై వ్యతిరేకత భావాన్ని కలిగిస్తుంది. అలాంటి మాటలతో మైలేజీ కంటే డ్యామేజే కలుగుతుందన్న మాట రాజకీయ పార్టీలే కాదు..వివిధ పార్టీ నేతలు మొత్తుకుంటున్నా.. పట్టించుకోకపోవటం కనిపిస్తుంది.తాజాగా మెగా బ్రదర్ కం జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కం ఎమ్మెల్సీ నాగబాబు మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలోని లావేరు మండల కేంద్రంలో జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన వారు చేస్తున్న రప్పా రప్పా నరుకుతామనే నినాదాలపై స్పందించారు. "రప్పా రప్పా నరుకుతామంటే ఇప్పుడున్న సీట్లు కూడా రావు. 2024 ఎన్నికల్లో జనసేన ఒంటరిగా పోటీ చేసేలా వైసీపీ ఎన్నో కుట్రలు చేసింది. మళ్లీ జగన్ కు అవకాశం ఇవ్వకూడదని.. రాష్ట్ర ప్రయోజనాల కోసమే మేం కూటమితో పొత్తు పెట్టుకొని పోటీ చేశాం. మరోసారి వైసీపీకి అవకాశం ఇస్తే.. ప్రజలు ఏపీని విడిచి పెట్టి వెళ్లిపోవాల్సిన పరిస్థితి వస్తుంది" అని పేర్కొన్నారు.రాష్ట్రంలో మరో పదిహేనేళ్లు జనసేన. టీడీపీ.. బీజేపీ ఐక్యత సాగుతుందన్న నాగబాబు.. కూటమి కలిసి ఉన్నంతవరకు వైసీపీ ఆటలు సాగవన్నారు. వైసీపీ బెదిరింపులకు కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలన్న నాగబాబు.. వైసీపీ కార్యకర్తలు.. రప్పా రప్పా నరుకుతామన్న మాటలపై చేసిన తాజా వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. మెగా బ్రదర్ చేసిన ఈ వ్యాఖ్యల్ని వైసీపీ అండ్ కో కాస్తంత సీరియస్ గా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వైసీపీ అధినాయకత్వం మరేం చేస్తుందో చూడాలి.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## టీడీపీ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కు డ్రగ్ పాజిటివ్ : ఈగల్ ఎస్పీ గిరిధర్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో సంచలనంగా మారిన మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ఇప్పటికే పలువురు ప్రముఖులకు డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన నేపథ్యంలో తాజాగా తెలుగుదేశం పార్టీకి చెందిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు కూడా డ్రగ్స్ పాజిటివ్ అని నిర్ధారణ కావడం రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ విషయాన్ని ఈగల్ విభాగం ఎస్పీ గిరిధర్ అధికారికంగా వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని ఆజీజ్‌నగర్ ప్రాంతంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫాం హౌస్‌లో శనివారం రాత్రి అనుమతి లేకుండా భారీ స్థాయిలో డ్రగ్స్ పార్టీ జరుగుతున్నట్లు సమాచారం అందింది. దీంతో రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో ఈగల్ టీమ్, ఎస్‌వోటీ సిబ్బంది, స్థానిక పోలీసులు కలిసి ఫాం హౌస్‌పై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. పోలీసులు అక్కడికి చేరుకున్న వెంటనే అక్కడ ఉన్నవారు భయంతో గందరగోళానికి గురయ్యారు. ఈ సమయంలో ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త నమీద్ మిశ్రా గాల్లోకి ఒక రౌండ్ కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. ఆ తుపాకీ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి సోదరుడు రితేష్ రెడ్డిదిగా పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనతో అక్కడ పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఆ సమయంలో ఫాం హౌస్‌లో మొత్తం 11 మంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరిలో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, ఢిల్లీ వ్యాపారి నమీద్ మిశ్రా, రితేష్ రెడ్డి, కౌశిక్ రవి, అర్జున్ రెడ్డి సహా పలువురు వ్యాపారవేత్తలు మరియు ఒక మహిళ కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు నిర్వహించిన ప్రాథమిక డ్రగ్స్ పరీక్షల్లో మొదటగా పైలట్ రోహిత్ రెడ్డి, నమీద్ మిశ్రా, రితేష్ రెడ్డి, కౌశిక్ రవి, అర్జున్ రెడ్డిలకు డ్రగ్స్ పాజిటివ్‌గా తేలింది. అయితే శనివారం రాత్రి నిర్వహించిన తొలి పరీక్షల్లో ఎంపీ పుట్టా మహేష్‌కు నెగిటివ్ వచ్చినప్పటికీ ఆదివారం ఉదయం నిర్వహించిన తదుపరి పరీక్షల్లో డ్రగ్స్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. శరీరంలోని మెటబాలిజం ప్రభావం కారణంగా ఈ మార్పు వచ్చినట్లు ఈగల్ ఎస్పీ గిరిధర్ వివరించారు.

దర్యాప్తులో భాగంగా నిందితులు ఇటీవల సిమ్లా , గోవా పర్యటనలకు వెళ్లిన సమయంలో డ్రగ్స్‌ను సేకరించి తీసుకువచ్చి ఈ పార్టీలో వినియోగించినట్లు పోలీసులు గుర్తించారు. ఫాం హౌస్‌లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో సుమారు 2 గ్రాముల కొకైన్ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్స్ నమూనాలను మరింత పరీక్షల కోసం ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ కు పంపించారు. ఈ ఘటనలో పాల్గొన్న వారిపై పోలీసులు పలు చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తును కొనసాగిస్తున్నారు. ఈ కేసులో ఎంతటి పెద్దవారు ఉన్నా సరే ఎంపీలు అయినా మాజీ ఎమ్మెల్యేలు అయినా చట్టం ముందు అందరూ సమానమేనని ఎస్పీ గిరిధర్ స్పష్టం చేశారు. చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే, సిట్టింగ్ ఎంపీ డ్రగ్స్ కేసులో పట్టుబడటం రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయంగా పెద్ద దుమారం రేపుతోంది. ఒకవైపు ప్రభుత్వాలు డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు చేపడుతుంటే ప్రజాప్రతినిధులే డ్రగ్స్ వినియోగిస్తున్నారన్న వార్తలు బయటకు రావడంతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ కేసు రాజకీయ వర్గాల్లోనే కాకుండా సామాజికంగా కూడా పెద్ద చర్చకు దారి తీసింది.

## ధ్వంసమైన ఐఫోన్‌ల మిస్టరీ.. డ్రగ్స్ కేసులో పైలెట్ రోహిత్ రెడ్డి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు..

**హైదరాబాద్ పెన్ పవర్:** మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసులో వెలుగుచూస్తున్న పరిణామాలు, పోలీసుల దర్యాప్తు తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి.

**మొయినాబాద్ ఫాంహౌస్‌లో ఏం జరిగింది?**

హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్‌లోని ఒక ఫాంహౌస్‌లో ఇటీవల జరిగిన వీకెండ్ పార్టీపై 'ఈగల్ టీమ్' పోలీసులు మెరుపు దాడులు చేశారు. విలాసవంతమైన పార్టీ జరుగుతుండగా పోలీసులు రంగప్రవేశం చేయడంతో అక్కడ ఉన్న వారంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ దాడుల్లో పోలీసులు మొత్తం 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో ఆరుగురు డ్రగ్స్ తీసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది.

**పైలెట్ రోహిత్ రెడ్డి చుట్టూ తిరుగుతున్న విచారణ**

ఈ కేసులో ప్రధానంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఈ పార్టీలో ఆయనతో పాటు ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, ఏపీలోని ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ కూడా ఉన్నట్లు తేలింది. వీరంతా డ్రగ్స్ తీసుకున్నట్లు బయటపడటంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

**ధ్వంసమైన ఐఫోన్‌ల మిస్టరీ**

పోలీసుల దర్యాప్తులో అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే దాడుల సమయంలో ఫాంహౌస్‌లో రెండు ఐఫోన్‌లను ధ్వంసం చేయడం. విచారణలో భాగంగా ఆ ఫోన్‌లు పైలెట్ రోహిత్ రెడ్డి , అతని పీఏ శ్రవణ్‌కు చెందినవని పోలీసులు గుర్తించారు. ఆ ఫోన్‌లను రోహిత్ రెడ్డే స్వయంగా ధ్వంసం చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ప్రస్తుతం ఈ ఫోన్‌లలో ఉన్న డేటా, వాట్సాప్ చాట్స్ మరియు డ్రగ్స్ సరఫరాదారుల వివరాలను రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. దీనికోసం పీఏ శ్రవణ్‌ను పోలీసులు విచారిస్తున్నారు. అతను వెల్లడించే వివరాలు ఈ కేసులో కీలక మలుపు తిరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**జీవో నంబర్.4 ప్రాధాన్యత.. కౌన్సిలింగ్ వైపు మొగ్గు?**

ఈ కేసులో మరో ముఖ్యమైన అంశం 'జీవో నంబర్.4'. డ్రగ్స్ కేసుల్లో తొలిసారి పట్టుబడిన వారికి కఠిన చర్యల కంటే కౌన్సిలింగ్‌కు ప్రాధాన్యతనివ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ జీవోను జారీ చేసింది. డ్రగ్స్‌కు బానిసలైన వారిని సంస్కరించే క్రమంలో నేర ప్రవృత్తి లేని వారిని సాధారణ వ్యక్తులుగా మార్చడమే దీని ప్రధాన ఉద్దేశ్యం. అయితే ఈ కేసులో నిందితులు బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు కావడంతో పోలీసులు చట్టప్రకారం కఠినంగా వ్యవహరిస్తారా లేదా జీవో ప్రకారం కౌన్సిలింగ్‌కు పరిమితం చేస్తారా అనేది ఉత్కంఠగా మారింది.

# ఇరాన్ లో రాజరికం పునరాగమనం? అగ్రరాజ్యం మద్దతుతో రెజా పహ్లావీ సంచలన వ్యాఖ్యలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌లో ప్రస్తుతం ఉన్న ఇస్లామిక్ రిపబ్లిక్ ప్రభుత్వం పశ్చిమ దేశాల దాడులతో పతనం అంచున ఉందన్న వార్తల నేపథ్యంలో, బహిష్కృత మాజీ యువరాజు రెజా పహ్లావీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ ఇరాన్‌లో ప్రస్తుత పాలన ముగిస్తే, దేశ బాధ్యతలను స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రకటించారు. 1979లో ఇస్లామిక్ విప్లవం తర్వాత తన కుటుంబాన్ని దేశం నుంచి బహిష్కరించినప్పటికీ, ఇరాన్ ప్రజల సంక్షేమం కోసం తిరిగి రావాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. దశాబ్దాలుగా అమెరికాలో ఉంటున్న పహ్లావీ, ఇప్పుడు ఇరాన్ రాజకీయాల్లోకి అధికారికంగా రీ-ఎంట్రీ ఇవ్వడానికి పావులు కదుపుతున్నారు.

**అభివృద్ధికి మాస్టర్ ప్లాన్!**

కేవలం అధికారాన్ని ఆశించడమే కాదు.. ఇరాన్‌ను తిరిగి గాడిలో పెట్టడానికి పహ్లావీ ఒక సమగ్ర ప్రణాళికను సిద్ధం చేశారు. దీనికి 'ఇరాన్ ప్రోస్పెరిటీ ప్రాజెక్ట్' అని పేరు పెట్టారు. యుద్ధం, అంతర్జాతీయ ఆంక్షల వల్ల చిన్నాభిన్నమైన దేశ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించడం, దేశంలో శాంతి నెలకొల్పడం, మౌలిక సదుపాయాల మెరుగు ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. ఇరాన్ వద్ద ఉన్న అపారమైన చమురు సంపదను ప్రజల శ్రేయస్సు కోసం వాడతామని, ఇస్లామిక్ పాలనలో కోల్పోయిన అంతర్జాతీయ గౌరవాన్ని తిరిగి తెస్తానని హామీ ఇస్తున్నారు.

**పహ్లావీ వంశం పతనం!**

రెజా పహ్లావీ ఇరాన్ చివరి రాజు మహ్మద్ రెజా షా పహ్లావీ కుమారుడు. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం మొదలై.. భారీ ఎత్తున అల్లర్లు చెలరేగడంతో మహ్మద్ రెజా షా పహ్లావీ తన ప్రాణాలు కాపాడుకోవడానికి అమెరికాకు పారిపోయారు. ఆ తర్వాత అయతుల్లా ఖమేనీ నేతృత్వంలో ఇస్లామిక్ ప్రభుత్వం ఏర్పడి, రాజరికాన్ని పూర్తిగా రద్దు చేయడమే కాకుండా పహ్లావీ కుటుంబాన్ని దేశం నుంచి బహిష్కరించింది. అప్పటి నుంచి ఈ కుటుంబం విదేశాల్లో ఉంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పుతోంది. ఇప్పుడు యుద్ధ పరిస్థితులు మళ్లీ ఈ రాజవంశానికి కొత్త ఆశలు చిగురింపజేస్తున్నాయి.

**యువత ఆలోచన**

ఇరాన్‌లో పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, కఠినమైన మతపరమైన నిబంధనల వల్ల విసిగిపోయిన ఒక వర్గం పహ్లావీ కాలం నాటి స్వేచ్ఛాయుత జీవనాన్ని కోరుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా మహిళా హక్కుల కోసం పోరాడుతున్న వారు, పాత రాజరికం కాలంలో ఉన్న సామాజిక స్వేచ్ఛను గుర్తు చేసుకుంటున్నారు. అయితే, మెజారిటీ ప్రజలు మళ్లీ రాజరికానికి మొగ్గు చూపుతారా? లేదా ప్రజాస్వామ్య వ్యవస్థను కోరుకుంటారా? అనేది సందేహమే. పహ్లావీ మాత్రం తాను కేవలం దేశాన్ని మార్పు వైపు నడిపించే ఒక సంధానకర్తగా ఉంటానని, భవిష్యత్తును ప్రజలే నిర్ణయిస్తారని చెబుతున్నారు. రెజా పహ్లావీ రాక ఇరాన్‌లో పెను మార్పులకు దారితీయవచ్చు లేదా మరింత అంతర్యుద్ధానికి దారితీయవచ్చు. అమెరికా మద్దతు ఉన్న పహ్లావీ

అధికారంలోకి వస్తే పశ్చిమ దేశాలతో ఇరాన్ సంబంధాలు మెరుగుపడే అవకాశం ఉంది. కానీ, 45 ఏళ్ల పాటు ఇరాన్ రాజకీయాల్లో లేని వ్యక్తిని ప్రజలు ఎంత వరకు నమ్ముతారనేది పెద్ద ప్రశ్న. యుద్ధం ముగిసిన తర్వాత ఇరాన్ ఒక కొత్త ప్రజాస్వామ్య దేశంగా మారుతుందా? లేక పహ్లావీ సారథ్యంలో మళ్లీ రాజరికం వైపు వెళ్తుందా? అన్నది కాలమే నిర్ణయించాలి. ఏది ఏమైనా, ఇరాన్ రాజకీయ చదరంగంలో పహ్లావీ ఇప్పుడు ఒక బలమైన పావుగా మారారు.

# సీబీఐపై వైఎస్ సునీత అసంతృప్తి, వివేకా హత్య కేసుపై సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తుపై వైఎస్ సునీత్ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. దర్యాప్తు సంస్థ సీబీఐ బాధ్యతగా వ్యవహరించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వివేకా ఏడో వర్ధంతి సందర్భంగా సునీత పులివెందుల వెళ్లారు. ఈ సమయంలో మీడియాతో మాట్లాడుతూ సునీత తీవ్ర ఆరోపణలు చేశారు. హత్యపై ఇప్పటికీ తన అనుమానాలను నివృత్తి చేయలేదని సునీత వ్యాఖ్యానించారు. వివేకా హత్య కేసుపై దర్యాప్తు ముగిసిందని సీబీఐ సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ నేపథ్యంలో సునీత వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.హత్య కేసు దర్యాప్తు చేసిన సీబీఐ నిందితులు చెప్పిన అంశాలనే చెబుతోందని, వారు చెప్పినట్లు నడుచుకుంటోందని సునీత ఆరోపించారు. సీబీఐ లోతుగా దర్యాప్తు చేయలేదని విమర్శించారు. తన తండ్రి హత్య తర్వాత నిందితుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, మెసేజెస్ పై సీబీఐ దృష్టి పెట్టలేదని సునీత పెదవి విరిచారు. ఇంకా ఏమైనా ఆధారాలు ఉంటే ఇవ్వండని అడిగితే, తన వద్ద ఉన్న అదనపు ఆధారాలను సైతం కోర్టుతోపాటు సీబీఐకి సమర్పించినట్లు సునీత తెలిపారు. వివేకా హత్యపై తన సోదరుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి, ఆయన భార్య భారతీరెడ్డిని విచారించాలని సునీత డిమాండ్ చేశారు.తన తండ్రి హత్య కేసుపై తీవ్రస్థాయిలో పోరాటం చేస్తున్నానని, అయినా తనకు న్యాయం జరగడం లేదని వైఎస్ సునీత ఆవేదన వ్యక్తం చేశారు. చాలా బాధగా ఉందని, తన పోరాటం ఇంతటితో ఆగదని సునీత వెల్లడించారు. చివరి వరకు పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. మన దేశంలో వ్యవస్థలన్నీ ఇలానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం తీర్పు తర్వాత సునీత వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. వివేకా హత్య సమాచారం మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి ఎలా తెలిసింది? అన్న అంశంపై సునీత స్పష్టత కోరుతున్నారు.అయితే దర్యాప్తు సంస్థ ఆ అంశాన్ని మాత్రం పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఇప్పటికే మూడు చార్జిషీట్లు దాఖలు చేశామని, దర్యాప్తు ముగిసినట్లేనని సీబీఐ తేల్చిచెబుతోంది. కానీ, సునీత మాత్రం ఇంకా కొందరు నిందితులను గుర్తించాలని, అసలు సూత్రధారులు తప్పించుకున్నారని అంటున్నారు. దీంతో హత్య కేసు విచారణ కూడా ముందుకు సాగడం లేదు. వివేకా హత్య జరిగి నేటి ఏడేళ్లు పూర్తవుతోంది. 2019 మార్చి 15న మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య జరిగింది. రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనం రేపిన హత్య కేసు ఇప్పటికీ అనేక మలుపులు తిరుగుతోంది.

# క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన పాక్ ప్లేయర్ సర్ఫరాజ్ అహ్మద్



**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ మాజీ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. (మార్చి 15) ఈ విషయాన్ని అధికారికంగా అతడు వెల్లడించారు. గత రెండు సంవత్సరాలుగా అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్న సర్ఫరాజ్ చివరిసారిగా 2023లో టెస్టు మ్యాచ్ ఆడగా, 2021లో వైట్ బాల్ క్రికెట్‌లో చివరి మ్యాచ్ ఆడారు. తన రిటైర్మెంట్ ప్రకటన సందర్భంగా అతడు మాట్లాడుతూ.. పాకిస్థాన్ తరపున ఆడటం తన జీవితంలో గొప్ప గౌరవమని పేర్కొన్నారు. 2006లో అండర్---19 జట్టును ప్రపంచ ఛాంపియన్‌గా నిలిపినప్పటి నుంచి 2017లో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్న క్షణం వరకు పాక్ జెర్సీలో గడిపిన ప్రతి క్షణం ప్రత్యేకమైనదే అన్నారు.

నా కెరీర్ మొత్తంలో అండగా నిలిచిన సహచర ఆటగాళ్లు, కోచ్‌లు, కుటుంబ సభ్యులు, అభిమానులకు కృతజ్ఞతలు అని సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. అలాగే అన్ని ఫార్మాట్లలో పాకిస్థాన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడంతో తన కల నెరవేరినట్టే అన్నారు. ఎప్పుడూ నిర్భయంగా క్రికెట్ ఆడాలని, ఐక్యంగా ఉండే జట్టును నిర్మించాలని ప్రయత్నించాను.. నా కెప్టెన్సీలో బాబర్ ఆజం, ఫఖర్ జమాన్, హసన్ అలీ, షాహీన్ షా అఫ్రిది, షాదాబ్ ఖాన్ వంటి ఆటగాళ్లు మ్యాచ్ విన్నర్లుగా ఎదగడం నాకు గర్వకారణంగా ఉందని ఆయన వెల్లడించారు. 2006లో దేశీయ క్రికెట్‌లో అడుగు పెట్టిన సర్ఫరాజ్ అహ్మద్, 2007 నవంబర్‌లో జైపూర్ వేదికగా భారత జట్టుతో జరిగిన మ్యాచ్‌లో వన్డేల్లో అరంగేట్రం చేశారు. అనంతరం 2010లో టెస్టు, టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో కూడా తొలి మ్యాచ్ ఆడారు. తన టెస్టు కెరీర్‌లో సర్ఫరాజ్ మొత్తం 3031 పరుగులు చేయగా, వన్డేల్లో 2315 పరుగులు చేశాడు. టీ20ల్లో 42 ఇన్నింగ్స్‌లలో 818 పరుగులు చేశారు. ముఖ్యంగా 2017లో జరిగిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్ జట్టును విజేతగా నిలిపి చరిత్రలో నిలిచిపోయారు. ఫైనల్లో పాకిస్థాన్ జట్టు భారత్ ని ఓడించి ట్రోఫీని కైవసం చేసుకుంది. అయితే 2019లో

ఇంగ్లాండ్‌లో జరిగిన ప్రపంచకప్ తర్వాత పాకిస్థాన్ జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సర్ఫరాజ్ స్థానం జట్టులో స్థిరంగా తన స్థానాన్ని నిలుపుకోలేకపోయాడు. ఆ టోర్నమెంట్ తర్వాత ఆయన కేవలం మూడు వన్డే మ్యాచ్‌లు మాత్రమే ఆడారు.అయితే జూనియర్ క్రికెట్ ఆడే స్థాయిలో కూడా సర్ఫరాజ్ అహ్మద్ అనేక విజయాలు సాధించారు. 2006లో జరిగిన అండర్-19 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ జట్టును విజేతగా నిలిపారు. ఆ ఫైనల్లో భారత్‌పై విజయం సాధించారు. ఆ భారత జట్టులో రోహిత్ శర్మ, ఛటేశ్వర్ పుజారా, రవీంద్ర జడేజా, పీయూష్ చావ్లా వంటి ఆటగాళ్లు సభ్యులుగా ఉన్నారు. కాగా ఇటీవల వచ్చిన నివేదికల ప్రకారం సర్ఫరాజ్ అహ్మద్ త్వరలో పాకిస్థాన్ జట్టు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే ఆయనను ఎంపిక కమిటీలో మిస్బా-ఉల్-హక్ తో పాటు సభ్యుడిగా నియమించారు.

# ఆ ఇద్దరినీ వదిలిపెట్టి కేకేఆర్ పెద్ద తప్పు చేసింది.. ఐపీఎల్ ట్రోఫీ గెలవదని కుంబ్లే జోస్యం




**హైదరాబాద్ పెన్ పవర్:** మరికొద్ది రోజుల్లో ఐపీఎల్ 2026 ప్రారంభం కానుంది. మార్చి 28వ తేదీన ఆర్సీబీ వర్సెస్ -ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌తో ఈ మెగా టోర్నీ స్టార్ట్ అవుతుంది. ఇప్పటికే కేకేఆర్ టీమ్ కెప్టెన్ గా ఎవరు ఉంటారనే అంశం వార్తల్లో నిలిచింది. బంగ్లాదేశ్ ఆటగాడు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను బీసీసీఐ ఆదేశాలతో జట్టు నుంచి తప్పించి.. అతడి ప్లేస్ లో జింబాబ్వే పేసర్ ముజరబానీని తీసుకుంది. జట్టులోని కీలక ప్లేయర్స్ వేలానికి ముందు రిటైన్ చేసుకోకుండా వదిలి పెట్టింది. కేకేఆర్ తీరుపై భారత మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే రియాక్ట్ అయ్యాడు. శ్రేయస్ అయ్యర్, ఫిల్ సాల్ట్ లని విడిచి పెట్టి కోల్‌కతా నైట్‌రైడర్స్ పెద్ద తప్పు చేసిందని అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డాడు. కీలక ప్లేయర్స్ ని అట్టిపెట్టుకోవడం ఎంత ముఖ్యమన్నది వాళ్లు అర్థం చేసుకుంటే తప్ప ఐపీఎల్ టైటిల్ కి కేకేఆర్ అర్హత సాధించలేదని హెచ్చరించాడు. 2024లో శ్రేయస్ ఆధ్వర్యంలో కోల్‌కతా ట్రోఫీ గెలుచుకుంది. అనంతరం అతడు, సాల్ట్ ఆ జట్టును వదిలి పెట్టారు.. శ్రేయస్ పంజాబ్ జట్టులో జాయిన్ కాగా.. సాల్ట్ ఆర్సీబీలో చేరాడు. దాదాపు దశాబ్దం విరామం తర్వాత గత ఏడాది పంజాబ్ కింగ్స్ ఫైనల్ చేరగా.. ఆర్సీబీ తొలిసారి టైటిల్ ని కైవసం చేసుకుంది.. రెండేళ్ల కింద కేకేఆర్ ఐపీఎల్ కప్ విన్నర్ గా నిలిచింది.. మూడోసారి టైటిల్ ని దక్కించుకున్న కేకేఆర్.. విజయంలో శ్రేయస్, సాల్ట్ కీ రోల్ పోషించారని వెల్లడించారు.కోల్‌కతా నైట్‌రైడర్స్ యాజమాన్యం ఆ ఇద్దరినీ వదిలి పెట్టుకుంది.. సీనియర్ ఆటగాళ్లను అట్టిపెట్టుకునే విషయంలో కోల్‌కతాకి నిలకడ లేదని మాజీ ఆటగాడు అనిల్ కుంబ్లే పేర్కొన్నారు. శ్రేయస్, సాల్ట్ ను వదులుకోవాలిని కేకేఆర్ నిర్ణయం తప్పని చెప్పారు. అజింక్యా రహానె రూపంలో అనుభవజ్ఞుడైన కెప్టెన్ కేకేఆర్ కి ఉన్నప్పటికీ.. కెప్టెన్ గా అతడు ఇంకా టైటిల్ ని దక్కించుకోలేదని తెలిపాడు. శ్రేయస్ అయ్యర్ నాయకత్వ పటిమపై కుంబ్లే ప్రశంసలు కురిపించాడు.

# న్యూజిలాండ్‌పై అదరగొట్టిన సౌతాఫ్రికా.. ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం





**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్ టూర్ ని సౌతాఫ్రికా ఘనంగా ప్రారంభించింది. మౌంట్ మంగనూయ్ వేదికగా జరిగిన తొలి టీ20లో కివీస్ పై ఏకంగా 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా గ్రాండ్ విక్టరీ సాధించింది. దీంతో ఐదు మ్యాచుల సిరీస్ లో ప్రోటీస్ 1---0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఐడెన్ మార్క్రమ్, క్వింటన్ డికాక్, కగిసో రబాడ, లుంగి ఎంగిడి లాంటి సీనియర్లు లేనిప్పటికి.. కేశవ్ మహారాజ్ కెప్టెన్సీలో సఫారీ యంగ్ టీమ్ అద్భుతంగా రాణించింది. ఈ మ్యాచులో మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 14.3 ఓవర్లలో కేవలం 91 రన్స్ చేసి ఆలౌట్ అయింది. ప్రోటీస్ బౌలర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు విలవిల్లాడారు.

న్యూజిలాండ్ బ్యాటర్లలో నీషమ్(26) ఒక్కడే టాప్ స్కోరర్ గా నిలిచాడు. మిగితా బ్యాటర్లు అందరూ ఘోరంగా విఫలం అయ్యారు. ప్రోటీస్ బౌలర్లలో న్కొబాని మోకోనా 3 వికెట్లు తీసుకోగా, కోయిట్జ్, బార్ట్మన్, కేశవ్ మహారాజ్ తలా రెండు వికెట్ల చొప్పున పడగొట్టారు. అనంతరం 92 పరుగుల లక్ష్య చేధన కోసం బరిలోకి దిగిన సౌతాఫ్రికా కూడా తీవ్రంగా కష్టపడింది. కివీస్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో.. సఫారీలను ముప్పు తిప్పలు పెట్టాడు.ఇక సౌతాఫ్రికా ఓపెనర్ కానర్ ఎస్టర్‌హైజెన్(45) అజేయంగా నిలిచి మ్యాచ్ ని కంప్లీంట్ చేశాడు. ఫలితంగా ప్రోటీస్ లక్ష్యాన్ని 16.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి టార్గెట్ ని చేధించింది. దీంతో రెండు జట్ల మధ్య రెండో టీ20 హామిల్టన్ వేదికగా మార్చి 17వ తేదీన జరగనుంది.




# ప్రభాస్- హోంబలే డీల్.. ఆ ఇద్దరు డైరెక్టర్స్ ఎవరు?




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ మధ్య ఇటీవల కుదిరిన భారీ డీల్.. ఇప్పటికే సినీ ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. ఇప్పటికే వీరి కాంబినేషన్ లో వచ్చిన సలార్: పార్ట్ 1 సీజ్ ఫైర్ భారీ విజయాన్ని సాధించింది. ఆ సక్సెస్ తో ప్రభాస్- హోంబలే ఫిల్మ్స్ కాంబోపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అంతే కాదు ఆ మూడు సినిమాల డీల్ అందరి దృష్టిని ఆకర్షించింది.అయితే ఆ డీల్ లో భాగంగా ఇప్పటికే ఒక సినిమా ఫిక్స్ అయింది. అదే సలార్: పార్ట్ 2 శౌర్యంగ పర్వం. స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన సలార్ ఫస్ట్ పార్ట్.. పాన్ ఇండియా లెవెల్ లో సూపర్ రెస్పాన్స్ అందుకుంది. యాక్షన్ ఎలిమెంట్స్, స్టోరీ, ప్రభాస్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎలివేషన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దీంతో సీక్వెల్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ప్రస్తుతం ప్రభాస్ ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, సలార్ 2 త్వరలోనే సెట్స్ పైకి వెళ్లే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఆ సినిమాను హోంబలే ఫిల్మ్స్ భారీ స్థాయిలో నిర్మించనుంది. అయితే ప్రభాస్ తో చేసుకున్న ఒప్పందంలో భాగంగా మిగిలిన రెండు సినిమాలు ఏమిటన్నది ఇప్పటికీ అధికారికంగా ప్రకటించలేదు. దీంతో ఆ మూవీలు.. ప్రభాస్ ఏ డైరెక్టర్స్ తో చేయనున్నారోనని ఇప్పటికీ క్వశ్చన్ మార్క్.అయితే ఆ రెండు ప్రాజెక్టులు ఇద్దరు యువ దర్శకులతో ఉండొచ్చనే వార్తలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. ఆ దర్శకుల్లో ఒకరు మలయాళ డైరెక్టర్ దింజిత్ అయ్యథాన్ అని టాక్ వినిపిస్తోంది. ఆయన కిష్కింధ కాండ, ఏకో సినిమాలతో ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇటీవల దింజిత్ ప్రభాస్ ను కలిసి కథ వినిపించినట్లు తెలుస్తోంది. డార్లింగ్ ఇమేజ్ కు తగ్గట్లు దింజిత్ ఆ స్టోరీ రాసుకున్నారని టాక్. అదే సమయంలో మరో దర్శకుడు కూడా డార్లింగ్ కు ఇటీవల ఓ కథ వినిపించినట్లు సమాచారం. కోలీవుడ్ దర్శకుడు రాజ్ కుమార్ పెరియస్వామి ఇటీవల ప్రభాస్ ను కలిసి న ట్లు వార్తలు వినిపిస్తున్నా యి. రాజ్ కుమార్ దర్శకత్వంలో వచ్చిన అమరన్ మంచి విజయాన్ని అందుకోవడంతో ఆయన కథపై కూడా ఆసక్తి నెలకొంది. అయితే ఆ రెండు కథలు విన్న ప్రభాస్.. ఇంకా ఫైనల్ డెసిషన్ తీసుకోలేదని తెలుస్తోంది.ప్రస్తుతం ప్రభాస్ చేతిలో పలు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి మధ్య హోంబలే ఫిల్మ్స్ తో ఉన్న మూడు చిత్రాల ఒప్పందం స్పెషల్ ఇంపార్టెన్స్ దక్కించుకుంది. ముఖ్యంగా సలార్ 2 ఇప్పటికే ఖరారవ్వడంతో మిగిలిన రెండు సినిమాలు ఏవో అన్న ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. దింజిత్ అయ్యథాన్, రాజ్ కుమార్ పెరియస్వామి చెప్పిన కథలలో ఏది ఫైనల్ అవుతుందో లేదా మరో కొత్త దర్శకుడితో సినిమా ప్రకటిస్తారా అన్నది త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అప్పటివరకు ఆ ప్రాజెక్టులపై చర్చ కొనసాగుతూనే ఉంటుంది.




Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At FLAT NO. 31, RAJEEV NAGAR, VISAKHA A COLONY, NEAR JAMATHOTA, KILLIPALEM PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. "PEN POWER" vide PRGI Registration No. "APTEL/25/A4918" Editor: GANTYADA APPARAO. e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. Editor GANTYADA APPARAO.e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965